honeybee.org
Vol-8 Issue-6

సంపుటి 8 సంచిక 6 సెప్టెంబర్ - అక్టోబర్ 2020

# పల్లెసృజన

www.pallesrujana.org

## గ్రామీణ సృజనా శక్తికి వెలుగుదారుల వేదిక



# అసంపూర్ణ శిల్పం యొక్క అసమగ్ర కథ



విధాన్‌పూర్‌లో 'వజ్రాసన్' అనే పేరొందిన శిల్పి ఉండేవాడు. పురాణాల్లో చెప్పబడిన రేవతీనది ఒడ్డున వున్న విధాన్‌పూర్ శిల్పాలకి, హస్తకళలకి ప్రసిద్ధి చెందింది. ఆ రాజ్యంలోనివారే కాక, పక్క రాజ్యాల ప్రముఖులు కూడా వజ్రాసన్ శిల్పాలు కొని తీసుకెళ్ళి గర్వంగా ప్రదర్శించుకొనేవారు. కానీ, ఇతనితో ఒకటే సమస్య అతను చెక్కిన ప్రతి శిల్పంలో ఏదో ఒక భాగాన్ని అసంపూర్ణంగా వదిలేసేవాడు. ఉదాహరణకి ఒక కాలో, చెయ్యో, చెవో, శరీరంలో ఏదో ఒక భాగాన్ని పూర్తి చేయకుండా వదిలేసేవాడు. ఇది ప్రజలకి నచ్చేది కాదు. కానీ చాలా పేరున్న శిల్పి కనుక ఎవ్వరూ ఏమీ అనటానికి సాహసించేవారు కాదు. ఇదో వెర్రితనం అని సహించేవారు. దానికాయన "తన శిల్పంలోని అసంపూర్ణ భాగాన్ని చూసేవారిలో ఏదో సంభాషణ ప్రారంభించటానికి ప్రేరణ అవుతుంది, ఆవిధంగా శిల్పంలోని బాగున్న నాగాలకి పాకుతుంది" అనేవాడు.

ఒకరోజు ఈయనకి పనులలో సహాయం చేస్తూ ఆయనవద్ద శిల్పకళలో శిక్షణ పొందుతున్న 'నచికేత' అనే ఒక శిష్యుడు గురువుగారు సగం చేసిన శిల్పాన్ని తుడుస్తూ కింద పడవేయగా దానిలో ఒక చిన్న ముక్క విరిగిపోయింది. గురువుగారికి చాలా కోపం వచ్చింది. చేసిన పనికి శిష్యుడ్ని బాగా కోప్పడ్డాడు. దానికి నచికేత వినమ్రంగా "అయ్యా మీరెలాగూ ఒక భాగాన్ని అసంపూర్ణంగా వదిలేస్తారు కనుక ఈ పడిపోయిన శిల్పంలో విరిగిపోయిన భాగాన్ని అసంపూర్ణంగా వదిలేయొచ్చు కదా?" అన్నాడు. దానికి గురువు గారికి ఇంకా కోపం వచ్చి "నీకు అసంపూర్ణవాదం గురించి ఏమి తెలుసు? శిల్పం తయారవుతున్న సమయంలో సమతులనాన్ని చూడందే ఏ భాగాన్ని అసంపూర్ణంగా వదిలేయాలో బాగా ఆలోచించి నిర్ణయించాలి. ఈ శిల్పంలో నేనా దశకి ఇంకా చేరుకోలేదు" అన్నాడు.

నచికేతకి ఈ తత్వం అర్థం కాలేదు కానీ మౌనంగా ఉండిపోయాడు.

మీకేమైనా అర్థమైందా? ఏదైనా పనిలో లేదా ఏదైనా ఒక భాగంలో ఎప్పుడు ఎంత అసంపూర్ణంగా ఉన్నది అన్నదానికి ఇంత ప్రాముఖ్యత ఇవ్వాలా? ఏదైనా పనిలో లేదా వ్యక్తిలో ఈ అసంపూర్ణతే బహుశా మన దృష్టిని ఆకర్షిస్తుందేమో! అదే మనకి గుర్తుండిపోయి సంపూర్ణంగా ఉన్నవాటిని త్వరగా, తేలికగా మర్చిపోతామేమో! ఒక్కసారి ఆలోచించండి. ఈ రెండూ కలిసుంటేనే బాగుంటుందేమో?

మన దైనందిక జీవితంలో ఈ అసంపూర్ణవాదం, దాని ప్రభావంపై మీ అనుభవాలు మాకు వ్రాయండి.

**– హనీబీ 21(4) – అక్టోబర్ – డిసెంబర్ 2010.**

Vol-8, Issue - 6 September - October 2020

# పల్లెసృజన

సంపుటి-8 సంచిక - 6 సెప్టెంబర్ - అక్టోబర్ 2020

పల్లెసృజన, 102, వాయుపురి,
సైనిక్‌పురి పోస్ట్, సికింద్రాబాద్– 500 094.
ఫోన్ : 040–27111959, 98660 01678
E-mail : president@pallesrujana.org,
Visit at :www.pallesrujana.org

**సంపాదకవర్గం**

ప్రధాన సంపాదకులు :
**బ్రిగేడియర్ (రిటైర్డ్) పోగుల గణేశం**

సంపాదకులు :
**జమ్మలమడక శశిమోహన్**

ఉప సంపాదకులు :
**పల్లె వీర రాఘవ రెడ్డి**

సలహాదారులు :
**ప్రొ. అనిల్ గుప్త**
**పి. చంద్రకాంత్ శర్మ**
**జాగర్లమూడి దుర్గాప్రసాద్**
**జమ్మలమడక శ్రీకర్**
**కల్పనా శాస్త్రి**

కార్టూన్స్ : **వెంకట్**

డిజైనింగ్ & ప్రింటింగ్ :
**నరేంద్ర గ్రాఫిక్స్, హైదరాబాద్.**
ఫోన్ : 81257 99904,
E-mail : narendragrafixhyd@gmail.com

**Rs. 1,000/-**
**for 5 years Subscription**

## విషయ సూచిక



పొలంలో కోతులు, ఎరువుల సమస్యలకు పరిష్కారాలు చూపిన పొత్కూరి మహేశ్వర రెడ్డి 3



10వ ద్వైవార్షిక పోటీ విజేతలు 7



రైతు ఇంజనీర్ 'ముళ్ళపూడి సత్యనారాయణ' 12



గ్రాస్‌రూట్స్ ఇన్నోవేషన్లు 19



రైతులకు వరం గడ్డంపాలెం లింగారెడ్డి సృజన అడవి జంతువులు, పక్షుల నుంచి పంట రక్షణ 22

తోటివారి బాధల తీర్చే 4 ఇన్నోవేషన్‌లను అందించిన కొల్లి నాగశ్రీనివాస్ 25





డా. ఎపిజె అబ్దుల్ కలాం 'ఇగ్నైట్-2019' పోటీ విజేతలు 27



ఆయుర్వేద జ్ఞాన మథనం- వెల్లుల్లితో వెల్లివిరిసే ఆరోగ్యం 30

స్పందన 32



<u>కవర్ లోపలి పేజీల్లో ...</u>

అసంపూర్ణ శిల్పం యొక్క అసమగ్ర కథ,
అమ్మకానికి సిద్ధంగా వున్న రైతుల కోసం రైతుల ఇన్నోవేషన్లు

<u>మధ్య పేజీలో :</u>

ప్రస్తుత సీజన్‌లో రైతులకు అవసరమైన ఇన్నోవేషన్లు

Printed, Published and Owned by **P. Ganesham** and Printed at **M/s Narendra Grafix**, 1-5-1055/2/14, Saibaba Nagar, Old Alwal, Secunderabad, Medchal- Malkajgiri Dist. - 500010.Telangana State and Published at 102, Vayupuri, Sainikpuri Post, Malkajgiri Mandal, Medchal- Malkajgiri Dist. –500094. Telangana State, Editor : **J. Sesimohan.**

### HoneyBee Regional Collaborators & Publications

**Honey Bee (English)**
AES Boys Hostel Campus, Near Gujarat University Library & SBI Bank, Navrangapura, Ahmedabad - 380 009 Gujarat, India.
Phone: 91-79-27912792, Fax: 91-79-27913293 Email: honeybee@sristi.org

**Karshakan Samsarikkatte (Malayalam)**
Fr Hubby Mathew
Peermade Development Society,
Peermade, Idukki - 685531,
Kerala hmathew@gmail.com

**Num Vali Velanmai (Tamil)**
Mr P Vivekanandan
45, T P M Nagar,Virattipathu,
Madurai - 625010 Tamil Nadu
vivekseva@gmail.com

**Palle Srujana (Telugu)**
Brig Pogula Ganesham VSM (Retd)
102, Vayupuri, Sainikpuri Post
Secunderabad-500 094 Telangana.
president@pallesrujana.org, www.pallesrujana.org

**Loksarvani (Gujarati)**
SRISTI, P O Box No.15050
Ambawadi Ahmedabad - 380015 Gujarat
loksarvani@sristi.org

**Sujh-Bujh Aas Paas ki (Hindi)**
SRISTI, P O Box No.15050
Ambawadi Ahmedabad - 380015 Gujarat
loksarvani@sristi.org

# రైతులకై పరిష్కారాల వెల్లువ

వ్యవసాయం ఒక యజ్ఞం. ప్రతి పంటకు, ప్రతి భూమికి, ప్రతి ప్రదేశానికి అనువైన పద్ధతులు, పరికరాలు, అవగాహన ఉన్నప్పుడే ఈ వ్యవసాయ యజ్ఞం పరిపూర్ణమవుతుంది. అందుకే "కొన్ని పరిస్థితులలో వ్యవసాయం చేయటానికి కొన్ని ప్రత్యేకమైన పద్ధతులు, పరికరాలు అవసరమౌతాయి. ఈ పరికరాలు సాంకేతికత, ప్రామాణికాలతో ఉండటం వలన ఈ రెండింటికి పొత్తు సులభంగా కుదరదు" అని వ్యవసాయ నిపుణులు అభిప్రాయ పడుతారు. సాంకేతిక పరిష్కారాలు, చేతి పరికరాలు రైతులకు కావలసినవి సాధ్యమైనంత వరకు స్థానికంగా చేస్తే రైతుల ఉత్పాదక శక్తి పెరిగే అవకాశముంది. ఈ దిశలో ఎందరో గ్రాస్‌రూట్స్ ఇన్నోవేటర్లు రైతుల సమస్యలకు సందర్భోచితంగా రైతులకు అనుకూలంగా, అందుబాటులో ఉండేట్టుగా రకరకాల పరికరాలు తయారు చేస్తున్నారు. ఈ సంచికలో కొన్ని ఇన్నోవేషన్లు ప్రచురించాము.

మొక్కజొన్నలో కలుపు తీయటానికి సరియైన పరికరాలు రైతులకు అందుబాటులో లేవు. మహబూబ్‌నగర్ జిల్లా వాసి చరణ్ తేజ చేతితో సులువుగా మొక్కజొన్నలో కలుపు తీసే పరికరం తయారు చేసాడు. అయితే వెంకటయ్య అనే అదే జిల్లావాసి, ఇంజన్‌తో నడిచే మొక్కజొన్న కలుపు యంత్రం తయారు చేశాడు. మహిపాల్ చారి 5 హార్స్‌పవర్ ఇంజన్‌తో మెట్ట పంటల్లో కలుపు తీయడానికి ముఖ్యంగా కంది, ప్రత్తి, పసుపు, మిరప తోటల్లో సులువుగా తక్కువ ఖర్చుతో నడిచే "మహిపాల్ వీడర్" తయారు చేసి గత ఏడు సంవత్సరాల్లో దాదాపు 2000 వీడర్లు దేశమంతటా రైతులకు అందజేశారు. నల్గొండ జిల్లావాసి బాలయ్య పాత స్కూటర్ ఇంజన్‌తో వీడర్ తయారు చేశాడు. ఇవి కూడా దాదాపు 600 వీడర్లు రైతులకు సరఫరా చేసాడు. అయితే కొప్పుల అశోక్ గుంటూరు జిల్లా వాసి 7.5 హార్స్‌పవర్ ఇంజన్‌తో వీడర్ మాత్రమే కాకుండా మరో మూడు పనులకు కూడా రైతులు ఉపయోగించుకునేట్టుగా "అశోక్ మల్టిపర్పస్ వీడర్" తయారు చేసారు. విత్తనాలు వేయడం, రొటోవేటర్ నడపడం, స్ప్రేయర్‌గా వాడడం... ఇవన్నీ అశోక్ వీడర్‌తో సాధ్యమవుతాయి. ఖాదర్ మస్తాన్ ఒంగోలు వాసి ఇంజనీరింగు పరంగా ఉత్తమ నాణ్యతతో తానొక వీడర్ మెట్ట పంటలకై తయారు చేసాడు. రైతులకు సరియైన వీడర్ కొనడానికి ఇన్ని వీడర్లుండడం వల్ల తనకు కావలసింది కొనుక్కునే అవకాశముంది.

అలాగే రైతుకు అడవి పందులు, పక్షుల వల్ల పంటలకు నష్టం జరుగుతుంది. వీటి నష్ట నివారణకు ఎన్నో రకాల పద్ధతులు రైతులు అవలంభిస్తున్నారు. 'పల్లెసృజన' ఈ పద్ధతుల గురించి క్రిందటి సంచికల్లో పాఠకులకు తెలియజేసింది. అయితే జగిత్యాల జిల్లా అంజయ్య అడవి పందుల నుండి పంటలను కాపాడటానికి ఎలక్ట్రానిక్ అలారం తయారు చేసి రెండు వందల మంది రైతుల పొలాల్లో బిగించాడు. నిజామాబాద్ జిల్లా రైతు లింగారెడ్డి పక్షుల నుండి, పందుల నుండి పంటల రక్షణకు ఒక ప్రత్యేకమైన పరికరం తయారు చేశాడు. ఇది ఎన్నో రకాల చప్పుళ్ళను చేస్తుంది, అది కూడా రైతు నిర్ణయించిన సమయానికి, ఇంటినుండే నియంత్రించేలా చేయటమే ఈ అలారం మెషీన్ ప్రత్యేకత. ఈ మెషీన్‌కు కావల్సిన విద్యుత్తు సోలార్‌తో అందేటట్లుగా అమర్చాడు. అంతేకాదు సమీప రైతుల పొలాలకు ఈయన మెషీన్ నుండి రకరకాల చప్పుళ్ళు ప్రసారం చేసి వారి పొలాలకు కూడా మెషీన్ అవసరం లేకుండా రక్షణ కల్పిస్తున్నాడు. అయితే మహేష్ రెడ్డి గన్ను పేల్చి శబ్దాలు సృష్టించడంతో కోతులు పరారవుతున్నాయి. ఈ సంచికలో లింగారెడ్డి, మహేష్ రెడ్డి ఇన్నోవేషన్‌లను గురించి చదవండి.

రైతులకు వరి కోసిన తర్వాత, దాన్ని ఎత్తి ట్రాక్టర్‌లోకి ఎత్తటం, ఎండపెట్టడం, చివరికి సంచుల్లో పోయటం వగైరా పనులకు కూలీల అవసరం ఉంటుంది. చిన్న, సన్నకారు రైతులు కూలీల ఖర్చును భరించలేరు. భార్యాభర్తలు చేసుకోవడానికి ప్రయత్నం చేస్తారు కానీ చాలా కష్టతరమైన పని. అందరికీ తగినంత శారీరక శక్తి ఉండదు. ఇలాంటి సందర్భాలలో యంత్రాల ఆవశ్యకత ఎంతగానో ఉంది. ఉదయభాస్కర్ పొలం నుండి నేరుగా ధాన్యాన్ని ట్రాలీలో పోసుకునేలా ఒక యంత్రం తయారు చేశాడు. కిషన్‌రావు ఏడు రోజులు వరి ధాన్యం ఎండబెట్టవలసిన అవసరం లేకుండా ఒక మెషీన్‌తో ఎకరంలో పండిన ధాన్యాన్ని 2-3 గంటల్లో పూర్తిగా తేమను తీసివేసి, అమ్మకానికి సిద్ధంగా ఉండేలా ప్లాను చేశాడు.



ఇలాగే రకరకాల స్ప్రేయర్లు, విత్తనాలు చల్లే దగ్గరనుంచి వృథా కాకుండా తక్కువ శ్రమతో పంటల్లో యూరియా వేసే పరికరాలు, జీవామృతం లాంటి ప్రకృతి ఎరువులు కలపడానికీ, వాటిని పంటల్లో చల్లడానికి యంత్రాలు.... ఇలాంటివెన్నో పల్లెల్లో చిన్న పట్టణాల్లో రైతులు, మెకానిక్‌లు ఎన్నో ఇన్నోవేషన్‌లు చేసి రైతుల కష్టాలను తగ్గిస్తున్నారు. పంటకయ్యే పెట్టుబడిని తగ్గించడానికి కృషి చేస్తున్నారు. ఎన్నో గ్రామాల్లో, ఎంతోమంది ఇలాంటి ఇన్నోవేషన్లు చేయటంలో నిమగ్నమై ఉన్నారు. వాళ్ళందరినీ వెతకాలి, వారి అద్భుత పరిష్కారాలను పరికరాలను, యంత్రాలను వెలుగులోకి తీసుకు రావాలి. సమానాంతరంగా పల్లెనుండి పల్లెకు, రైతు నుండి రైతుకు ఈ అవసరమైన పరికరాలను అందించాలి. ఇది పల్లెసృజన ఉద్దేశ్యం. గత పదిహేను సంవత్సరాలుగా రైతన్నల కష్ట నివారణకు, వారి ఆనంద జీవితానికి కారకులం కావాలన్న ఆశతో ఈ జ్ఞానయాత్ర మీ అందరి సహకారంతో సాగిస్తున్నాం. ఇంకా సాగుతూనే ఉంటుంది.

వర్షాలు సక్రమంగా పడ్డా, అకాల వర్షాల వల్ల రెండు తెలుగు రాష్ట్రాల రైతులకు లక్షలాది ఎకరాల్లో పంట నష్టం భారీగా జరిగింది. దీన్నుంచి తట్టుకోవడానికి ప్రభుత్వం, సమాజం పూర్తిగా సహకారం ఇస్తుందని ఆశిస్తూ...... మీ అందరి క్షేమం సదా కోరుతూ...

భవదీయ

బ్రిగేడియర్ పోగుల గణేశం (రిటైర్డ్)

# పొలంలో కోతులు, ఎరువుల సమస్యలకు పరిష్కారాలు చూపిన పొత్కూరి మహేశ్వర రెడ్డి



- పల్లె వీరరాఘవ రెడ్డి

నిజామాబాద్ జిల్లా, ఏరుట్ల మండల కేంద్రానికి చెందిన పొత్కూరి మల్లయ్య, చంద్రకళల కుమారుడు 31 సంవత్సరాల మహేశ్వర రెడ్డిది వ్యవసాయ ఆధారిత కుటుంబం. ఇతనికి ఇద్దరు అమ్మాయిలు. తమ 10 ఎకరాల పొలంలో వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తుంటారు. 10వ తరగతి వరకు చదువుకుని, గత 15 సంవత్సరాలుగా వ్యవసాయంలో తన తండ్రికి తోడుగా తాను కూడా పొలం పనులలో నిమగ్నమై మంచి పంటలు పండించుకుంటున్నాడు.

మహేష్ రెడ్డి తాను సాగు చేస్తున్న మొక్కజొన్న పంటను కోతుల బారినుండి కాపాడుకోవటం ఎంతో కష్టంగానూ, ఖర్చుతో కూడుకున్నదిగా వుండేది. పొలం చుట్టూ తిరుగుతూ ఒక డబ్బాలో రాళ్ళు వేసుకుని శబ్దాలు చేసుకుంటూ కోతులను పారదోలుతుండేవాడు. ఒక్కోసారి కోతుల బెడద ఎక్కువైనపుడు కూలీలను కూడా ఏర్పాటు చేసి ఎక్కువగా శబ్దాలు చేయవలసి వచ్చేది. ఆ శబ్దాలకు కూడా అవి అలవాటు పడిపోవటం, మనిషి ఒక వైపుకు వెళ్ళగానే మరో వైపున పంటను నాశనం చేస్తూ వుండటంతో ఇలా కాదని సమీప పట్టణానికి వెళ్ళి బాణసంచా కొనుగోలు చేసి టపాసులు పేలుస్తూ కొంత వరకు కోతుల బెడదను ఎదుర్కో గలిగాడు. ఇలా టపాసులు కొనుగోలు చేయడానికి రోజుకు రెండు నుంచి మూడు వందల దాకా ఖర్చయ్యేది. ఇది చాలా శ్రమ, ఖర్చుతో కూడుకున్నదై పోతోందని అనుకున్నాడు. ఈ కోతుల నుండి పంటను రక్షించుకోవటానికే సమయమంతా సరిపోతే మిగతా పొలం పనులకు ఆటంకంగా మారే పరిస్థితి వచ్చింది. తన పొలం కొండ గుట్టల సమీపంలో వుండటంతో వాటి బెడద ఇంకా ఎక్కువగా వుండేది.

ఈ సమస్యను ఎదుర్కోవటానికి తక్కువ ఖర్చుతో ఏదైనా పరికరం తయారు చేస్తే బావుంటుందని ఆలోచించాడు మహేష్. ఒక ప్రదర్శన శాలలో అడవి పందుల నివారణకు బాణసంచా పేల్చే పరికరం చూశాడు కానీ, అంత ఖరీదు రైతులు భరించలేరని ఆలోచించి, పివిసి పైపులతో కేవలం నాలుగు ఐదు వందల ఖర్చుతో మొత్తానికి ఒక పరికరం తయారు చేశాడు.

ఈ పరికరంలో గ్యాస్ వెల్డింగ్ వారు ఉపయోగించే 'కాల్షియం కార్బోనేట్' అనే పదార్థాన్ని తెచ్చుకుని నిల్వ వుంచుకోవాలి. ఈ పరికరంలో కేవలం 10 నుండి 15 గ్రాముల కాల్షియం కార్బోనేట్‌ను వేసి అందులో 5 మి.లీ. నీరు పోస్తే, 15 సెకండ్ల తర్వాత అందులో నుండి గ్యాస్ ఉత్పత్తి అవుతుంది. ఆ గ్యాస్‌ను ఇంట్లో గ్యాస్ స్టౌ వెలిగించడానికి ఉపయోగించే లేదా సిగరెట్ వెలిగించుకునే గ్యాస్ లైటర్‌తో గాని వెలిగించినట్లయితే అది పేలి ఆ శబ్దం నాలుగు నుండి 6 ఎకరాల దూరం వరకు వినిపిస్తుంది. ఆ శబ్దానికి కోతులు బెదిరి పారిపోతాయి.

ఇలా చేయటం వల్ల పర్యావరణానికి కాని,

మనుషులకు, జంతువులకు ఎటువంటి హాని వుండదు. ఇలా చేయటానికి అయ్యే కర్చు అంతా కేవలం 25 పైసలు మాత్రమే వుంటుంది. రోజుకు 10 నుండి 15 సార్లు ఇలా పేల్చినా అయ్యే ఖర్చు 4–5 రూపాయలకు మించదు. అలా అప్పుడప్పుడూ పొలంలో ఈ పరికరం ద్వారా పేల్చుకుంటూ వుంటే చాలు కోతులు అటువైపుకు రావటం మానేశాయి. ఇలా చేయటం వల్ల రైతు పని మానుకుని కోతులను పారదోలే పనిలో వుండాల్సిన అవసరం లేదు. పొలంలో తన పని చేసుకుంటూనే అప్పుడప్పుడూ ఈ 'మంకీ గన్'ను పేల్చుకుంటూ వుంటే చాలు కోతుల నుండి విముక్తి పొంది, పంటను కాపాడుకోవచ్చు అంటాడు మహేష్ రెడ్డి.

టపాసులు పేల్చటం ద్వారా కూడా కోతులను నియంత్రించవచ్చు కానీ, అది ఖర్చుతో కూడుకున్నదే కాక, దానివల్ల పర్యావరణం కూడా కాలుష్యం అవుతుంది. అదే ఈ మంకీగన్ వల్ల ఎటువంటి పర్యావరణ నష్టం లేదు, ఖర్చు కూడా పెద్ద శబ్దం చేసే ఒక్క టపాసు ఖర్చుతో రోజంతా కోతులు రాకుండా చేసుకోవచ్చు అంటాడు మహేష్. అదే టపాసులతో కోతులను తోలేందుకుగాను టపాసుల ఖర్చు 100 నుండి 150 దాకా వుంటుంది, మనిషి కూలీ ఖర్చు ప్రస్తుత కూలీ రేట్ల ప్రకారం 3 నుంచి 4 వందల దాకా అవుతుంది అంటే మొత్తం వెరసి 5 నుండి 6 వందల ఖర్చును ఈ పరికరం మిగిల్చినట్లే కదా.

మహేష్ చేసిన ఈ పరికరాన్ని గురించి తెలుసుకున్న ఆ ప్రాంతం చుట్టుప్రక్కల రైతులు ఇతని వద్దకు వచ్చి తమకూ ఒక పరికరం చేసి ఇమ్మని చేయించుకుని తీసుకు వెళ్తున్నారు. వీటిని తయారు చేసేందుకు కొంత సమయం కేటాయించటం వల్ల తన పొలం పనులు కుంటుపడిపోతున్నాయని ఈ పరికరాన్ని ఎవరికి వారే ఎలా తయారు చేసుకోవాలో కూడా ఒక వీడియో తీసి 'యూ ట్యూబ్'లో వుంచి యావత్ రైతాంగానికి అవగాహన కల్పించాడు మహేష్. ఇతను ఇన్నోవేటర్‌గా ఆ పరికరాన్ని తాను మాత్రమే తయారు చేసి సంపాదించుకోవాలి అనుకోలేదు. తనకు దానివల్ల వచ్చే ఆదాయంకన్నా తన పొలం పనులు ముఖ్యమని భావించిన మహేష్ మంచి మనసుకు 'పల్లెసృజన' అభినందించకుండా వుండలేక పోయింది. ఇతని పరికరం తయారీ వీడియోను చూసి తాము స్వంతంగా తయారు చేసుకున్న రైతులు ఎవరైనా



వుంటే 'పల్లెసృజన'కు తెలియజేస్తే ఆ విషయం గురించి ప్రాచుర్యం కల్పిస్తాం.

ఎవరైనా తయారు చేసుకోలేని వాళ్ళ కోసం తన ఖాళీ సమయాల్లో ఈ పరికరాలను తయారు చేసి వుంచుకుంటూ వుంటాడు. రైతులు ఫోన్ చేస్తే, లేదా ఎవరైనా వ్యాపారస్తులు వాటిని కావాలంటే సరఫరా చేస్తూ వుంటాడు. ఈ విషయాన్ని తెలుసుకున్న సమీప జిల్లాలైన నిర్మల్, ఆదిలాబాద్, కరీంనగర్ ప్రాంతాల రైతులతో పాటు గుంటూరు, విజయవాడ లాంటి దూర ప్రాంత రైతులు కూడా ఇతనికి ఫోన్ చేసి ఆ విధానాన్ని వాట్సాప్ ద్వారా తెలుసుకుని తామే స్వయంగా తయారు చేసుకుని, మళ్ళీ ఇతనికి ఫోన్ చేసి ధన్యవాదాలు తెలుపుతూ వుండటం తనకెంతో సంతోషాన్నిచ్చిందని, తన పరికరం ఇంతమంది రైతులకు ఉపయోగ పడటం తనకెంతో ఆనందంగా వుందన్నాడు. తాను కూడా ఇప్పటికి దాదాపు 200 పరికరాల దాకా తయారు చేసి అమ్మానని తెలియజేశాడు.

ఇది కేవలం కోతులకే కాదు, పక్షులు, అడవి పందులు, ఏనుగులు లాంటి వాటి నుండి కూడా ఈ పరికరం సహాయంతో పంటలను కాపాడుకోవచ్చు. రాబోయే ఎండా కాలం ప్రొద్దుతిరుగుడు, జొన్న, సజ్జ పంటలపై పక్షుల వల్ల నష్టం జరిగే అవకాశముంది. కాబట్టి రైతులు ఈ పరికరాన్ని వినియోగించుకుని తమ పంటలను కాపాడుకోవాలని కోరుతోంది 'పల్లెసృజన'. అలాగే జామ, మామిడి లాంటి



పంటలలో కూడా రామ చిలుకలు, ఇతర పక్షుల నుంచి కూడా తమ పండ్ల తోటలను కాపాడుకోవచ్చు.

మహేష్ రెడ్డి 'మంకీ గన్ తయారు చేయడంతోనే తన సృజనాత్మకతను ఆపలేదు. మళ్ళీ కొద్ది రోజులకు తన మొక్కజొన్న పంటకే యూరియా వేయటం వల్ల కొంత కూలీల ఖర్చు పెరుగుతోంది, పైగా మొక్కకు తాను అందించే యూరియా సరిగ్గా అందటం లేదని గ్రహించి యూరియా వేసే పరికరాన్ని కూడా తయారు చేశాడు. దీనికి 'ఫర్టిలైజర్ గన్' అని పేరు పెట్టుకున్నాడు.

సాధారణంగా మొక్కల మొదళ్ళ వద్ద యూరియా వేయాలంటే కూలీలు వంగి మొక్కవద్ద యూరియా వేసుకుంటూ వెళ్ళాల్సి వుంటుంది. అది కూడా భూమిపైన వెయ్యటం వల్ల కొంత యూరియా ఆవిరి రూపంలో పోయి, అతి తక్కువ శాతం మాత్రమే మొక్కకు అందుతుంది. పైగా కూలీల ఖర్చు కూడా ఎక్కువ అవుతుంది. ఈ సమస్యలన్ని పరిష్కరిస్తుంది ఈ ఫర్టిలైజర్ గన్. ఈ పరికరం సహాయంతో 50 సంవత్సరాల పైబడిన వయసు వాళ్ళు కూడా సులభంగా మొక్క వద్ద వంగాల్సిన అవసరం లేకుండా నిలబడే వేసిన మొత్తం ఎరువు మొక్కకు పూర్తిగా అందేలా భూమిలో వేయవచ్చు.

యూరియా లేదా ఇతర ఎరువును వ్యక్తి మోయ గలిగినంత ఒక సంచిలో వేసుకుని దాన్ని వీపుకు తగిలించుకుని, ఆ సంచి ద్వారా ఈ పరికరానికి ఏర్పాటు చేయబడ్డ పైపును అమర్చుకుని వ్యక్తి నడుచుకుంటూ ప్రతి మొక్క వద్ద భూమిలోకి పరికరాన్ని గుచ్చి ఒక మీటను నొక్కడం ద్వారా ఆ మొక్కకు ఎంత అవసరమో అంతే ఎరువు నేరుగా మొక్క ప్రక్కనే భూమిలోకి పడిపోతుంది. ఇలా చేయటం వల్ల ఎరువు గాలిలో కలిసే అవకాశం వుండక పోవటంతో వేసిన ఎరువు 90 శాతం మొక్కకు అంది పంట దిగుబడి పెరిగే అవకాశం వుంటుంది. ఇలా ఒక మనిషి రోజుకు 4 ఎకరాల వరకు మిరప, మొక్క జొన్న పంటలకు ఎరువులు వేయవచ్చు.

యువ రైతు మహేష్ రెడ్డి క్రియాశీలతతో రైతులకు రెండు ఉపయోగకరమైన పరికరాలు ఇన్నోవేషన్ల రూపంలో అందాయి. ఇలాంటి రైతులు తమకోసం చేసుకున్న పరికరాలను వెలుగులోకి తీసుకువచ్చి సమస్త రైతాంగానికి తెలియజేయడానికి 'పల్లెసృజన' కృషి చేస్తున్నది. భవిష్యత్తులో మహేష్ రెడ్డి మరిన్ని రైతుల దైనందిన సమస్యలను పరిష్కరించాలని కోరుకుంటున్నాం. ఈయన ఇన్నోవేషన్‌లను జాతీయ స్థాయిలో గుర్తింపుకై 'పల్లెసృజన' కృషి చేస్తున్నది. ●

**వివరాలకు సంప్రదించండి :**

**ఇన్నోవేటర్ మహేశ్ రెడ్డి ఫోన్ : 94902 07184**


## పల్లెసృజన కార్యాలయంలో ఇన్నోవేషన్ల విస్తృత కేంద్రం

దేశవ్యాప్తంగా పునాదిస్థాయి ఇన్నోవేటర్లు (గ్రామీణ శాస్త్రవేత్తలు) తయారు చేసిన ఇన్నోవేషన్ల ప్రదర్శన 'పల్లెసృజన' కార్యాలయంలో ఏర్పాటు చేయడమైనది. ఈ ప్రదర్శనను పాఠశాల, ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు, రైతులు సందర్శిస్తున్నారు. రైతులు ఈప్రదర్శనను చూస్తే వారికి అవసరమైన పనిముట్లను గుర్తించి వాటిని లాభకరంగా వినియోగించుకునే అవకాశం లభించటంతో పాటు, దేశీయ జ్ఞానానికి చేయూతను అందించిన వారవుతారు. మీ సమస్యలను పల్లెసృజనతో చర్చించవచ్చు.



సోలార్ సెల్ ఛార్జర్



వివిధ రకాల శుభ్రపరిచే సేంద్రియ ద్రావణాలు



మినీ వాటర్ పంప్

హైదరాబాద్ వచ్చినపుడు 'పల్లెసృజన' కార్యాలయాన్ని తప్పక దర్శించండి.
ముందుగా మా కార్యాలయానికి సందేశాన్నిస్తే మీ సందర్శనను అర్థవంతంగా చేస్తాం.

'పల్లెసృజన' కార్యాలయం చిరునామా :
77, రోడ్ నెం. 3, వాయుపురి,
సైనిక్‌పురి పోస్టు, సికింద్రాబాద్ – 500 094.
ఫోన్ : 040–27111959, సెల్ : 96528 01700.
గూగుల్ మ్యాప్‌లో 'పల్లెసృజన' అని వ్రాస్తే మార్గం మీకు చూపిస్తుంది

# నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్ (ఎన్.ఐ.ఎఫ్.) - ఇండియా

స్వయంప్రతిపత్తి గల సంస్థ, శాస్త్ర సాంకేతిక శాఖ, భారత ప్రభుత్వము.

National Innovation Foundation-India



ఆకాశాన్ని అందుకోవాలన్న ఆశ....

## జాతీయ 12 వ ద్వైవార్షిక పోటీలు

**పునాది స్థాయిలో సహాయం అందని సాంకేతిక ఆవిష్కరణలు (ఇన్నోవేషన్లు) మరియు సంప్రదాయ జ్ఞానముల గుర్తింపు**

**నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్** (ఎన్.ఐ.ఎఫ్.) తన 12వ జాతీయ ద్వైవార్షిక పోటీలకు గాను ఎవరి సహాయమూ లేకుండా రూపొందించిన పునాది స్థాయికి చెందిన సాంకేతిక ఇన్నోవేషన్లు మరియు సాంప్రదాయ జ్ఞానం గురించిన దరఖాస్తులను కోరుతున్నది. ఈ ఇన్నోవేషన్లను రైతులు, కళాకారులు, చేతివృతుల వారు, జాలర్లు, మహిళలు వ్యక్తిగతంగా కాని, సామూహికంగా కాని పంపవచ్చు. మహిళలు, మురికి వాడల్లో నివసించే వారు, వర్క్‌షాప్ మెకానిక్‌లు, విద్యార్థులు, స్థానిక సమాజాలకి ప్రాధాన్యత ఇవ్వబడును. ఈ సృజనలు వ్యవసాయం (పనిముట్లు, యంత్రములు, కొత్త పద్ధతులు, కొత్త వంగడాలు మొదలైనవి), గృహోపకరణాలు, రవాణా, శక్తి (ఎనర్జీ), ఉత్పత్తి/ పరిరక్షణ, పని భారాన్ని తగ్గించటము, మూలికా వైద్యము (మానవులు మరియు జంతువులు) మొదలైన వాటికి సంబంధించినవై మరియు తక్కువ ఖర్చుతో కూడుకుని, ఎక్కువ కాలం మనగలిగి, పర్యావరణానికి హానికరం కానివై ఉండాలి. ఈ ఆలోచనలు లేదా నమూనాలు బయటివారి సహాయము/ పర్యవేక్షణ లేకుండా తాము స్వంతంగా తయారు చేసినవై, ఇతరుల నుండి ఎటువంటి సాంకేతిక సలహాలు తీసుకోకుండా రూపొందించినవై ఉండాలి. మహిళల కొరకు మహిళలచే, వికలాంగుల కొరకు వికలాంగులచే రూపొందించబడిన ఇన్నోవేషన్లు, ఉత్తమమైన సాంకేతిక జ్ఞానానికి ప్రత్యేకమైన బహుమతులు ఇవ్వబడుతాయి.

ఉత్తమమైన వాటిగా గుర్తించ బడిన వాటిలో జాతీయ మొదటి **బహుమతిగా రూ. 5,00,000, జాతీయ రెండవ బహుమతిగా రూ. 3,00,000, జాతీయ మూడవ బహుమతిగా రూ. 1,00,000లను వివిధ వర్గాలలో ఇవ్వబడును.** జీవిత కాలపు సాఫల్యత పురస్కారం క్రింద రూ. 7,50,000లు గొప్ప ఇన్నోవేటర్‌కు లేదా ఇన్నోవేషన్లనే జీవితంగా ఏర్పరచుకొన్న వారికి ఇవ్వబడును. అంతే కాదు ప్రోత్సాహక బహుమతి క్రింది రూ. 10,000లను వివిధ వర్గాలలో ఎన్నుకోబడిన ఇన్నోవేషన్లు, సమాజ శ్రేయస్సుకు, పర్యావరణానికి తోడ్పడ్డ వాటికి ఇవ్వబడును.

ఇవే కాక పునాది స్థాయిలో సాంకేతిక విజ్ఞానాన్ని వెతికి వెలికి తీయటానికి దోహదపడిన వ్యక్తులు లేదా సంస్థలకు కూడా గుర్తింపు ఉంటుంది. అదేవిధంగా సాంకేతిక జ్ఞానం కలవారు, పునాది స్థాయిలో ఇన్నోవేషన్లను వెలికి తీయటానికి కృషి చేసిన ఎలక్ట్రానిక్/ ప్రింట్ మీడియా జర్నలిస్టులకి కూడా గుర్తింపు ఉంటుంది. ఈ దరఖాస్తులను **31 మార్చి, 2021** లోగా మాకు చేరేలా పంపండి.

SRISTI HONEY BEE NETWORK GIAN

**మీ ఆవిష్కరణలను పంపవలసిన చిరునామా :**

**National Innovation Foundation,**
C/o Gram Bharati, Amrapur, Gandhi Nagar-Mahudi Road, Gandhi Nagar, Gujarat-382 721.
Phone: (02764) 261131/32/ 38/ 39, Fax: (079) 26731903, Email: campaign@nifindia.org, Website: www.nif.org.in

**సూచన :** వృత్తిపరమైన అనుభవం కలవారు లేదా వృత్తి కళాశాలలో చదువుకొనే విద్యార్థులు ఎన్.ఐ.ఎఫ్. నుండి ఏవిధమైన ఆర్థిక సహాయానికి కాని, పురస్కారాలకు కానీ అర్హులు కారని గమనించవలెను. అయినప్పటికీ అటువంటి వారు గ్రామస్థాయి ఇన్నోవేషన్లకి మెరుగు దిద్దినట్లయితే ఎన్.ఐ.ఎఫ్. వారిని గుర్తిస్తుంది. అర్హత వివరాలు, ఇతర మార్గదర్శకాలకై http://www.nif.org.in/announcement సంప్రదించండి. లేదా 'పల్లెసృజన' కార్యాలయాన్ని (ఫోన్ : **040-27111959**) సంప్రదించండి.

# 10వ జాతీయ ద్వైవార్షిక పోటీ విజేతలు




**ఎన్.ఐ.ఎఫ్. వారు 2019లో నిర్వహించిన 10వ జాతీయ స్థాయి ఇన్నోవేషన్ మరియు సాంప్రదాయ జ్ఞాన పోటీలలో జాతీయ బహుమతి పొందిన విజేతల వివరాలు**

- 'ఎన్.ఐ.ఎఫ్. వారి వ్యాసాలకు
స్వేచ్ఛానువాదం : జమ్మలమడక శశిమోహన్

## జాతీయ స్థాయి తృతీయ బహుమతి

## వివిధ రకాలుగా పనికి వచ్చే భూమిదున్నే పరికరం

**పేరు :మహరాజ్ సింగ్ లోడే**

నివాసి : రైసెన్, మధ్యప్రదేశ్.



మధ్యప్రదేశ్‌కు చెందిన 32 సంవత్సరాల మహరాజ్ సింగ్ లోడే ఆర్థిక కారణాల వలన 10వ తరగతి తరవాత చదువు ఆపేసి కుటుంబం లో వ్యవసాయ పనులలో సహాయ ము చెయ్యటం ప్రారంభించాడు. ఈవిధంగా చేస్తూనే క్రమంగా వ్యవసాయ పనిముట్లపై మక్కువ పెంచుకొని వాటిని రిపేర్లు చెయ్యటం చేస్తూ చివరికి తయారు చెయ్యటం వరకు వచ్చాడు. ఈ క్రమంలోనే అతను ఆగర్ నాగలి (భూమికి కన్నాలు చేసే (డ్రిల్) పరికరం) అభివృద్ధి చేసిన సబ్‌మెర్సిబుల్ పంప్, ట్రాక్టర్‌కి తగిలించే ఎం.బి. నాగలి లాంటివి స్థానిక వెల్డింగ్ షాపువారితో కలిసి తయారు చెయ్యగలిగాడు.

మహరాజ్ సింగ్ తన పొలంలో వ్యవసాయం చేసేటప్పుడు మామూలు కల్టివేటరు గట్టిగా ఉన్న తన భూమిలో ఒకటేసారి ఎక్కువ లోతుకి దున్నలేక పోవటం గమనించాడు. దీనికి పరిష్కారంగా తన మొదటి ప్రయత్నంలోనే ట్రాక్టర్‌కి అనుసంధానించేలాగ అయిదు ఆగర్ నాగళ్ళ (కన్నాలు చేసే వీలున్న నాగలి) మామూలు కల్టివేటర్ల స్థానంలో ఏర్పాటు చేశాడు. పర్యవసానంగా మొదటి సారి దున్నినప్పుడు లోతుగా





(కావలసిన లోపలికి) దున్నే సదుపాయం ఏర్పడింది. కానీ అది ఆ పరికరానికి త్వరగా అరుగు తరుగులు ఉండటంతో దీనికి చాలా బలిష్టంగా ఎం.బి. నాగలిలోపాటు అనేక రకాల పనులు చేసే విధంగా తీర్చిదిద్దాడు.

ఇది వివిధ వ్యవసాయ పనులు చెయ్యటానికి ఉపయోగ పడుతుంది. రెండుసార్లు దున్నాల్సిన అవసరం లేకుండా మొదటిసారే కావలసినంత లోతుగా దున్నగలదు. డిస్క్ నాగలి చేసే పని కూడా ఇదే చెయ్యగలదు. లెవలింగ్ కూడా చెయ్యగలదు. దీనితో ఒక గంటలో 3 లీటర్ల డీజిల్ ఖర్చుతో ఒకటిన్నర ఎకరాన్ని దున్ని చదును చేసుకోవచ్చు. అదీ 80% పనితనంతో సాధించవచ్చు. ఈ పరికరం 560 డ్రాఫ్ట్ ఫోర్సుతో 18 నుంచి 21 సెంటీమీటర్ల లోతుకి 2 మీటర్ల వెడల్పులో ఒకేసారి దున్నగలదు. దీని ఖరీదు సుమారు రూ. 50 వేలు ఉంటుంది.


పలు రకాలుగా పనికి వచ్చే ట్రాక్టర్‌కి అనుసంధానం చేసే ఈ పరికరం రూపొందించినందుకు గాను మహరాజ్ సింగ్‌కి 2019లో ఎన్.ఐ.ఎఫ్. వారు తమ 10వ జాతీయ ద్వైవార్షిక పోటీలలో జాతీయ స్థాయిలో మూడవ బహుమతి ఇచ్చి సత్కరించారు.

### జాతీయ తృతీయ బహుమతి

### వక్క చెట్లు (పోక చెక్క) ఎక్కి కాయలు కోసే యంత్రం

ఇన్నోవేటర్ : **పి.వి. సురేష్,** మల్లాపురం, కేరళ

41 సంవత్సరాల సురేష్ రబ్బరు తోటల్లో రబ్బరు సేకరణ శ్రామికుడిగా పని చేస్తుంటాడు. స్కూలు చదువు పూర్తి చెయ్యకపోయినా, తన స్వంత తెలివి తేటలతో ఎన్నో కొత్త వస్తువులు కనిపెట్టాడు. 2004లోనే నీటి ప్రవాహం



సహాయంతో 2 కి.వా. సామర్థ్యం కల ఒక పవర్ ప్లాంట్‌ని తన గ్రామం కోసం తయారు చేశాడు. దాని తర్వాత వస్తువులు ఒక చోటునుంచి ఇంకొక చోటుకి (కాలవల పైన కూడా) రవాణా చెయ్యటానికి 'రోప్ వే' రూపొందించాడు.

సురేష్ నివసించే మల్లాపురం ప్రాంతంలో వక్క చెట్లు ఎక్కువ. సంవత్సరానికి మూడుసార్లు ఆ సన్నని గాలికి ఊగిపోయే వక్క చెట్లు ఎక్కి కాయలు కొయ్యాల్సి వుంటుంది. ఈ పని ఎంతో ఆపదతో కూడుకున్నది. చాలా తక్కువ మంది ఎక్కువ కూలీకి ఈ పని చేస్తుంటారు. కాలక్రమేణ వారూ తగ్గిపోయారు. ఈ విషయం గమనించిన మన సురేష్ ఈ పోక చెక్క చెట్లు ఎక్కేందుకు వీలుగా ఉండే ఒక యంత్రం కనిపెట్టాలనుకొన్నాడు. కొంత కాలం శ్రమించి ముందు కరెంటుతో పని చేసే ఒక యంత్రాన్ని రూపొందించాడు. అది బాగానే పని చేస్తున్నా ఆ ప్రాంతంలో కరెంటు సప్లయ్ తరచూ పోవటం, తోట మధ్యదాకా కరెంటు వైర్లు తీసుకొని పోవటం సమస్యగా మారింది. దానితో ఇలా కాదని పెట్రోలు ఇంజన్‌తో పనిచేసే పోక చెట్లు ఎక్కి కాయలు కోసే యంత్రాన్ని రూపొందించాడు. ఈ యంత్రం 42 సిసి సామర్థ్యం కల పెట్రోలు ఇంజన్‌తో పని చేస్తుంది. దానిని రిమోట్‌తో గాని, మొబైల్ యాప్ ద్వారా గాని పని చేసేలా చేసుకోవచ్చు.

ఈ యంత్రంలో కసరత్తు చెయ్యాటానికి ఉపయోగించే డంబ్ బెల్స్ లాంటివి రబ్బరుతో చేసినవి ఉంటాయి. వాటిని చెట్లకు బిగిస్తూ రెండు వైపులా వున్న రబ్బరు గుళ్ళు పైకి, కిందకి వదులుతాయి. ఈ యంత్రం 100 నుంచి 203 మి.మీ.ల చుట్టు కొలత గల ఏ చెట్టుకైనా అమరేలా ఏర్పాటు చేయబడింది. చెట్టులో ఎత్తు పల్లాలు వున్నా ఇది సునాయాసంగా ఎక్కేస్తుంది. ఈ యంత్రం చెట్లని ఎంత త్వరగా ఎక్కి కాయలు కోయగలలో నియంత్రించుకొనే మార్గం కూడా





ఏర్పాటు చేయబడింది. సాధారణంగా ఎక్కడానికి ఒక నిమిషం, కాయలు కొయ్యడానికి ఒక నిమిషం, దిగడానికి ఒక నిమిషం ఇలా చెట్టుకి మూడు నిమిషాల సమయం పడుతుంది.

28 కిలోల బరువు వుండే ఈ యంత్రం ఒక లీటరు పెట్రోలుకి సుమారు మూడు గంటలు పని చేస్తుంది. ఒకవేళ యంత్రం చెట్టుపైన వుండి పని చెయ్యటం మానేస్తే ఎవ్వరు చెట్టు ఎక్కనవసరం లేకుండా యంత్రానికి కట్టి ఉంచిన తాడు సహాయంతో దీనిని క్రిందికి దించవచ్చు.

ఎంతోమంది పోక చెక్క రైతులకి సహాయకారిగా ఉంటూ వారి ఖర్చులు గణనీయంగా తగ్గించి, లాభాలు పెంచిన ఈ ఆవిష్కరణకు ఎన్.ఐ.ఎఫ్. వారు 2019లో నిర్వహించిన 10వ జాతీయ ద్వైవార్షిక ఇన్నోవేషన్ మరియు సాంప్రదాయ జ్ఞాన పోటీలలో జాతీయ స్థాయిలో తృతీయ బహుమతితో సత్కరించారు.

**జాతీయ మూడవ బహుమతి**

**అభివృద్ధి చేయబడిన చిక్కుడు రకం 'జె.కె.-1'**

ఇన్నోవేటర్ : **జీతాభాయ్ కోదర్‌భాయ్ పటేల్,** సబర్ కాంత జిల్లా, గుజరాత్.

64 సంవత్సరాల జీతాభాయ్ కోదర్‌భాయ్ పటేల్ గుజరాత్ రాష్ట్రంలోని సబరకాంత జిల్లాలో మధ్యతరగతి రైతు. ఈయన తనకున్న ఆరు ఎకరాల పొలంలో చిక్కుడు, ఆముదము, పత్తి, సోయాబీన్, గోధుమలే కాక పశుగ్రాసం కూడా పండించేవాడు.



ఇతను త్వరగా పంటకి వచ్చే మంచి రకం చిక్కుడు రకాన్ని కనిపెట్టాడు. ఇది అనుకోకుండా జరిగింది. 1987వ సంవత్సరంలో జితిన్‌భాయ్ తన పశువులకి మేత కలుపుదామని స్థానికంగా సేకరించిన చిక్కుడు గింజలు కొనగా, వాటిలో మంచిగా పెద్దగా ఉన్నట్లు గుర్తించి వాటిని విడిగా తీసి తన పొలంలో మరుసటి సంవత్సరం నాటాడు. ఆ గింజలు త్వరగా కాపుకి రావటమే కాక, గుత్తులు గుత్తులుగా కాయలు రావటం, చాలా రుచిగా ఉండటం గమనించాడు. ఎంపిక పద్ధతిలో ఆ విధంగా మంచి విత్తనాలను ఏరి, మరుసటి సంవత్సరం ప్రయోగాలు చేసిన తరువాత తనకి పూర్తి సంతృప్తినిచ్చే రకాన్ని స్థిర పరిచాడు. 1995లో వాటిని తనకి తెలిసిన రైతులకి ప్రయోగార్థమై ఇచ్చాడు. వారంతా కూడా ఎక్కువ కాయలు, గుత్తులు గుత్తులుగా కాస్తున్నాయి. మొదటి కాపు కూడా ఇతర సాధారణ రకాలకన్నా ముందుగా వస్తున్నవని చెప్పారు. వాటి రుచి అన్ని రకాలా ఉత్తమంగా ఉందన్నారు.

జీతాభాయ్ రూపొందించి తన పేరునే 'జె.కె.-1' రకాంగా పిలుచుకొనే ఈ చిక్కుడు కాయ మొదటి కోత 60-65 రోజుల్లో కోసుకోవచ్చు. చిక్కుడు కాయలు ఎక్కువ కాలం అంటే ఆగస్టునుంచి ఏప్రిల్ వరకు కూడా కాస్తూనే వుంటాయి. లేత ఆకుపచ్చ రంగులో పొడుగ్గా ఉండే ఈ చిక్కుడు కాయలు దృఢంగా మంచి దళసరిగా ఉండటమే కాక తీగకి 700 దాకా కాయలు కాస్తాయి. ఈ రకం హెక్టారుకి



కాయలు అయితే 675 క్వింటాళ్ళు దిగుబడి వస్తుంది. విత్తనానికైతే హెక్టారుకి 64 క్వింటాళ్ళ వరకు వస్తాయి. రుచి చాలా బాగుండటంతో గుజరాత్ ప్రాంతంలో అన్ని రకాల కూరగాయలు వేసి వండుకునే ప్రత్యేక వంటకం 'ఉంధియు'లో ఈ చిక్కుడు ప్రత్యేక ఆకర్షణ అయ్యింది.

దీనిని పరీక్షించడానికి గుజరాత్ లోని సుందర్ కృషి నగర్, దంతివాడ వ్యవసాయ విశ్వవిద్యాలయం వారు రెండు వేరువేరు ప్రదేశాలలో 2015-2017 సంవత్సరాలలో ప్రయోగించి చూడగా, ఈ జె.కె.-1 రకం 120% ఎక్కువ దిగుబడి యివ్వటమే కాక, మేలురకం కాయ అని కూడా నిర్ధారించారు. గుజరాత్ రాష్ట్రంలో ప్రస్తుతం ఈరకం సబర్‌కాంత ఆరావళి, పంచమహల్, దాహెూడ్, బనస్కాంత మొదలైన జిల్లాల్లో విరివిగా పండిస్తున్నారు.

ఎన్.ఐ.ఎఫ్. వారు క్షేత్రస్థాయి పరీక్షల్లో భాగంగా మహారాష్ట్రలోని పూనే, పల్‌ఘర్, జిల్లాలు, రాజస్థాన్‌లోని జయ్‌పూర్, శిఖర్ జిల్లాలలో ప్రయోగాలు చేసి చూడగా రైతుల వద్దనుంచి ఊహించినదానికన్నా ఎన్నో వంతుల ఎక్కువ మంచి స్పందన లభించింది. ముఖ్యంగా ఎక్కువ ఉత్పత్తి, తక్కువ సమయం, మంచి రుచి వినియోగదారుల మన్నన ... యివన్నీ ఈ రకానికి మంచి పేరు తెచ్చిపెట్టాయి. పిపివి & ఎఫ్ఆర్ఎ, న్యూఢిల్లీ వారి వద్దకు ఈ జెకె-1 రకాన్ని రిజిష్టర్ చేయడానికి దరఖాస్తు చేయడమైనది.

ఎన్.ఐ.ఎఫ్. వారు 2019లో జాతీయ ద్వైవార్షిక ఇన్నోవేషన్ మరియు సాంప్రదాయ జ్ఞాన పోటీలలో ఈ జెకె-1 రకానికి జీతాభాయ్ కోదర్‌భాయ్ పటేల్ కి జాతీయ స్థాయి మూడవ బహుమతి ఇచ్చి సత్కరించారు. ●

ఈ పరికరాలు కావలసిన వారు
సుభాష్ చందర్, ఫోన్ : **96528 01700**

## పల్లెసృజన కార్యాలయంలో ఇన్నోవేషన్ల విస్తృత కేంద్రం

**దేశవ్యాప్తంగా పునాదిస్థాయి ఇన్నోవేటర్లు (గ్రామీణ శాస్త్రవేత్తలు) తయారు చేసిన ఇన్నోవేషన్ల ప్రదర్శన 'పల్లెసృజన' కార్యాలయంలో ఏర్పాటు చేయడమైనది. ఈ ప్రదర్శనను పాఠశాల, ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు, రైతులు సందర్శిస్తున్నారు. రైతులు ఈప్రదర్శనను చూస్తే వారికి అవసరమైన పనిముట్లను గుర్తించి వాటిని లాభకరంగా వినియోగించుకునే అవకాశం లభించటంతో పాటు, దేశీయ జ్ఞానానికి చేయూతను అందించిన వారవుతారు. మీ సమస్యలను పల్లెసృజనతో చర్చించవచ్చు.**


సోలార్ సెల్ ఛార్జర్


వివిధ రకాల శుభ్రపరిచే సేంద్రియ ద్రావణాలు


శ్రీశైలం

హైదరాబాద్ వచ్చినపుడు
'పల్లెసృజన' కార్యాలయాన్ని తప్పక దర్శించండి.
ముందుగా మా కార్యాలయానికి సందేశాన్నిస్తే
మీ సందర్శనను అర్థవంతంగా చేస్తాం.
'పల్లెసృజన' కార్యాలయం చిరునామా :
77, రోడ్ నెం. 3, వాయుపురి,
సైనిక్‌పురి పోస్టు, సికింద్రాబాద్ - 500 094.
ఫోన్ : 040-27111959, సెల్ : 96528 01700.
ఇ-మెయిల్ : boddu.subhash4@gmail.com
గూగుల్ మ్యాప్‌లో 'పల్లెసృజన'
అని వ్రాస్తే మార్గం మీకు చూపిస్తుంది




# HRMN 99 రకం "ఆపిల్" మొక్కలు

హిమాచల్ ప్రదేశ్‌లో హరిమాన్ శర్మ ఒక ఆపిల్ రైతు. ఎన్నో సంవత్సరాలు శ్రమపడి ఏ వాతావరణంలోనైనా పెరిగే ఆపిల్ మొక్కలను పెంపొందించాడు. వీటి ప్రత్యేకత సుమారు 43–48 డిగ్రీల వేడి వాతావరణంలో కూడా పెరగ గలవు. చూడడానికి కేవలం ఒక కొమ్మలాగా ఉంటుంది కానీ, మొక్క నాటిన తరువాత 10–15 రోజులలో చిగురిస్తుంది. మొక్క పెరిగి పెద్దగా ఎదిగిన రెండవ సంవత్సరం నుండి పువ్వులు పూస్తుంది. మూడవ సంవత్సరం నుండి పండ్లు కాపుకు వస్తాయి. తినడానికి రుచికరంగా ఉంటాయి. ఈ మొక్క నాటే కాలం నవంబర్, డిసెంబర్, జనవరి నెలలు.

ఈ మొక్కకు జాతీయ గుర్తింపు లభించింది. దాదాపు అన్ని రకాల భూములకు అనుకూలం. **మొక్క ఖరీదు రూ. 220/–**

మొక్కలు కావలసిన వారు ఈ క్రింది బ్యాంకు అకౌంట్‌లో నవంబర్ 25 లోగా డబ్బులు పంప గలరు. డిసెంబర్ మొదటి వారంలో ఈ మొక్కలు పంపిణీ చేస్తాము.

కావలసిన వారు సంప్రదించండి :

**సుభాష్ చందర్, క్రియేటివ్ మైండ్స్.**

**ఫోన్ : 96528 01700, 040–27111959**

బ్యాంకు అకౌంట్ వివరాలు :

Creative Minds, A/c No: 510101006285094
Ifscode : CORP0000640
Corporation Bank, Sainikpuri Branch

# 'పల్లెసృజన ఇన్నోవేషన్ల' వెబ్‌నార్




ప్రతి బుధవారం ఉదయం 10 గంటలకు 'పల్లెసృజన' ఇన్నోవేషన్లపై ఒక వెబ్‌నార్ ఏర్పాటు చేస్తుంది. ప్రతి వారం రైతులకు ఉపయోగ పడే కొత్త ఇన్నోవేషన్లు పరిచయం చేస్తారు. రైతు ఇన్నోవేటర్లు ఇందులో పాల్గొని వారి ఇన్నోవేషన్ల గురించి మీతో సంభాషిస్తారు.

వెబ్‌నార్ లింక్ 'పల్లెసృజన' వెబ్‌సైట్
http://pallesrujana.org లో కాని,
సుభాష్ చందర్ (9652801700)
ద్వారా కాని పొందవచ్చు.

పల్లెసృజన అందరినీ సాదరంగా ఈ వెబ్‌నార్‌కు ఆహ్వానిస్తుంది.

– ఎడిటర్

# రైతు ఇంజనీర్ 'ముళ్ళపూడి సత్యనారాయణ'



- పల్లె వీరరాఘవ రెడ్డి

వ్యవసాయ పనుల్లో కొందరు సృజనాత్మక రైతులు ప్రతి చిన్న విషయాన్ని గమనించి, ఆ సమస్యలకు తామే పరిష్కారాలు వెతుక్కుంటారు దీనికి ప్రత్యక్ష సాక్ష్యం "ముళ్ళపూడి సత్యనారాయణ". భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, పినపాక మండలం, జానంపేట గ్రామానికి చెందిన సృజనాత్మక రైతు సత్యనారాయణ గురించి 'పల్లెసృజన' పాఠకులకు పరిచయమే. తన పొలంలో ట్రాక్టర్లతో సేద్యం చేసుకోవటమే కాదు, వాటి పని తీరును కూడా నిశితంగా గమనించి స్వయంగా గేర్లతో పని చేసే వీడర్లను రూపొందించాడు ఈ రైతు. సేద్యం చేసే పరికరాల విషయంలో ఎప్పటికప్పుడు కొత్తరకంగా ఆలోచించి సాంకేతిక జ్ఞానాన్ని అందిపుచ్చుకున్న రైతు ఇతను. మూడు రకాల వీడర్లు, ప్రత్తి వలిచే యంత్రాన్ని రూపొందించిన గొప్ప ఇన్నోవేటర్ ముళ్ళపూడి సత్యనారాయణ. ఇప్పుడు మరో నూతన ఆవిష్కరణతో మన ముందుకు వచ్చాడు. వ్యవసాయ పరికరాలు తయారు చేసేందుకు ఇంజనీరింగ్ చదవ వలసిన అవసరం లేదు, చెయ్యాలన్న లక్ష్యం, అనుభవం కూడా ఇంజనీరింగ్ చేయిస్తాయి అని నిరూపించాడు ముళ్ళపూడి సత్యనారాయణ.

సాధారణంగా పొలం మధ్యలో పెరిగినంతగా గట్ల వెంట కనీసం రెండు మూడు అడుగుల వరకు పంట ఎదగదు అన్న విషయం ప్రతి ఒక్కరికీ తెలుసు. ఈవిధంగా తమకు తెలియకుండానే కొంత పంట నష్టపోతుంటారు దాదాపు అందరు రైతులు. ఈ విషయాన్ని నిశితంగా పరిశీలించి, ఈ సమస్యకు కారణం తెలుసుకున్నాడు సత్యనారాయణ. అందుకు కారణం గట్లవెంట పొలాన్ని లోతుగా దున్నలేక పోవటం వల్ల అక్కడ భూమి గట్టిగా వుండటంతో పంట ఏపుగా పెరిగే అవకాశం ఉండదు. అలా పొలం గట్లవెంట కూడా బాగా లోతుగా దున్నుకోవాలంటే పొలం మధ్యలోకన్నా రెండుమూడు సార్లు ఎక్కువగా దున్నాల్సి వుంటుంది. ట్రాక్టర్లతో సేద్యం చేసేవారు ఎక్కువసార్లు దున్నుకోలేక పోవటం, గట్లవెంట లోతుగాను, మిగతా పొలంలో సాధారణంగా దున్నుకోవాలంటే డ్రైవర్ ట్రాక్టరు దిగి పరికరాలను సరిచేసుకోవాల్సి వుంటుంది.

అలాగే వరి మాగాణి పొలాల్లో ఎక్కువగా మడులు ఉంటాయి కాబట్టి వాటిల్లో ట్రాక్టరుతో మాగాణి చేసేటపుడు గట్లవెంట ఎత్తుగా ఉండటం వల్ల మడిలో నీరు సమానంగా ఉండక పోవటం వల్ల వరి పంట కొంత నష్టానికి గురవుతుంది. ఈ సమస్యలన్నిటికి పరిష్కారంగా ట్రాక్టరుకు ఎటువంటి మార్పు చేయవలసిన అవసరం లేకుండా ఒక పరికరాన్ని రూపొందించి, దానికి పేటెంటు హక్కులను కూడా పొందారు ముళ్ళపూడి సత్యనారాయణ.

మెట్ట చేలలో సాధారణంగా ట్రాక్టరు కల్టివేటరుతో దుక్కి దున్నే సమయంలో గట్లవెంబడి నేల గట్టిగా ఉండటం వలన దుక్కి లోతుగా రాదు. దుక్కి లోతుగా రావడంకోసం గట్లవెంబడి ఎక్కువసార్లు దున్నవలసి వస్తుంది. దీనివలన దుక్కి దున్నే సమయం మరియు డీజిల్ ఖర్చు పెరుగుతుంది.

వరి పండించే మాగాణి చేలలో ట్రాక్టరుతో దమ్ము చేసే సమయంలో గట్లవద్ద ట్రాక్టరు ముందు చక్రాలు కొంత బురద మట్టిని గట్ల ప్రక్కకు నెట్టివేస్తాయి. ఈవిధంగా పదేపదే జరగడం వలన గట్లవెంబడి సుమారు రెండు నుండి మూడు అడుగుల వెడల్పుతో, నాలుగు నుండి అయిదు అంగుళాల ఎత్తు వరకు మట్టి పేరుకుపోతుంది. ప్రధాన పొలం కన్నా గట్లవెంబడి ఎత్తుగా మట్టి పేరుకుపోవటం వలన మాగాణి చేలలో నీరు సమానంగా ఉండదు. దీనివల్ల గట్లవెంబడి కలుపు ఎక్కువగా వస్తుంది. కలుపు తీయడానికి కూలీలు ఎక్కువ కావాలి. వరిగట్లవెంబడి పెరుగుదల లేక ధాన్యం దిగుబడి కూడా తగ్గుతుంది.

పై సమస్యలకు పరిష్కార మార్గమే ముళ్ళపూడి సత్యనారాయణ తయారు చేసిన ట్రాక్టరు హైడ్రాలిక్ లెవెలర్. ప్రతి ట్రాక్టరుకు పరికరాలను తగిలించుకునే హైడ్రాలిక్‌తో పని





చేసే బద్దెలు ఉంటాయి. ట్రాక్టర్‌తో పని చేసే పరికరాలు భూమి సమతలంగా లేనపుడు ట్రాక్టరు హైడ్రాలిక్ కుడివైపు బద్దెకు అమర్చి వున్న మెకానికల్ అడ్జస్ట్‌మెంట్ ద్వారా పరికరాలను ట్రాక్టరుకు తగిలించుకుంటారు. ఈవిధానం ట్రాక్టరు ఉన్న ప్రతి రైతుకు తెలిసిందే. ట్రాక్టరు నాగలితో దున్నే సమయంలో ఈ వ్యవస్థ ఎంతో కీలకమైనది. ఈ మెకానికల్ అడ్జస్ట్‌మెంట్ చేసే సమయంలో డ్రైవరు ట్రాక్టరుమీద నుండి క్రిందకు దిగి వాటిని సరిచేసుకోవాలి. అలాగే గట్లవెంబడి లోతుగా దుక్కి రావాలంటే డ్రైవరు ట్రాక్టరు మీదనుండి క్రిందకు దిగి మెకానికల్ అడ్జస్ట్‌మెంట్ సరిచేసుకోవాల్సి వుంటుంది. గట్లవెంబడి దుక్కి పూర్తయిన తర్వాత డ్రైవరు మరలా ట్రాక్టరునుండి క్రిందకు దిగి మెకానికల్ అడ్జస్ట్‌మెంట్‌ను సరిచేసుకోవాలి. ఇది చాలా శ్రమతో కూడుకున్న వ్యవహారం.

ఈ సమస్య పరిష్కారానికి ఒక రైతుగా, తనకు ట్రాక్టర్లపైన వున్న అవగాహన, అనుభవంతో కనుగొన్న పరిష్కారమే "ముళ్ళపూడి సత్యనారాయణ ట్రాక్టరు హైడ్రాలిక్ లెవెలర్".

ఈ విధానంలో ట్రాక్టరు హడ్రాలిక్ బద్దెలకు ఉన్న మెకానికల్ అడ్జస్టర్ స్థానంలో హైడ్రాలిక్ సిలిండర్ అమర్చాడు. హైడ్రాలిక్ లివర్ సాయంతో ఈ సిలిండర్ పైకి క్రిందకు పని చేస్తుంది. దీనివలన మెట్ట దుక్కిలో కల్టివేటర్‌ను, దమ్ము చేసే సమయంలో దమ్ము గొర్రును లెవెలింగ్ సమయంలో లెవెల్ బ్లేడును మరియు నాగలిని కూడా కుడివైపుకు, ఎడమ వైపుకు అవసరాన్ని బట్టి హైడ్రాలిక్ లివర్ ద్వారా పైకి, క్రిందకు సరిచేసుకోవచ్చు.

ట్రాక్టర్ తయారీదారులు రూపొందించిన ప్రధాన హైడ్రాలిక్ లివర్‌కు ఎటువంటి మార్పు చెయ్యకుండానే ఈ



లివర్‌ను ప్రత్యేకంగా అమర్చాడు. దీనివల్ల డ్రైవర్ ట్రాక్టర్‌ను నడుపుకుంటూనే అవసరాన్ని బట్టి పొలం దున్నే పరికరాలను లివర్ ద్వారా అవసరమనుకున్న వైపుకు క్రిందకు, పైకి నియంత్రించుకోవచ్చు. దీనివల్ల గట్ల ప్రక్కన లోతు దుక్కి, మాగాణి చేలల్లో గట్ల ప్రక్కన మెరకలను సులభంగా సరిచేసుకోవచ్చు.

తక్కువ సమయంలో, తక్కువ డీజిల్ ఖర్చుతో ఈ



INTELLECTUAL PROPERTY INDIA
PATENTS | DESIGNS | TRADE MARKS
GEOGRAPHICAL INDICATIONS

क्रमांक : 044117607
SL No :

भारत सरकार
GOVERNMENT OF INDIA
पेटेंट कार्यालय
THE PATENT OFFICE
पेटेंट प्रमाणपत्र
PATENT CERTIFICATE
(Rule 74 Of The Patents Rules)

| | |
|---|---|
| पेटेंट सं. / Patent No. | 332340 |
| आवेदन सं. / Application No. | 2781/CHE/2011 |
| फाइल करने की तारीख / Date of Filing | 12/08/2011 |
| पेटेंटी / Patentee | 1.MULLAPUDI SATYA NARAYANA 2.MULLAPUDI BUJJI 3.MULLAPUDI YAMUNA 4.MULLAPUDI KRISHNAJA |

प्रमाणित किया जाता है कि पेटेंटी को उपरोक्त आवेदन में यथाप्रकटित HYDRAULIC LEVELER FOR TILLING AND LAND LEVELER नामक आविष्कार के लिए, पेटेंट अधिनियम, १९७० के उपबंधों के अनुसार आज तारीख 12th day of August 2011 से बीस वर्ष की अवधि के लिए पेटेंट अनुदत्त किया गया है।

It is hereby certified that a patent has been granted to the patentee for an invention entitled HYDRAULIC LEVELER FOR TILLING AND LAND LEVELER as disclosed in the above mentioned application for the term of 20 years from the 12th day of August 2011 in accordance with the provisions of the Patents Act,1970.

अनुदान की तारीख
Date of Grant

पेटेंट नियंत्रक
Controller of Patent

**పేటెంటు పొందిన ముళ్ళపూడి సత్యనారాయణ**



పనులను చేసుకోవచ్చు. దీనివలన గట్లవద్ద కూడా లోతుగా దుక్కి దున్నటంతో పైరు సమానంగా పెరగటం వల్ల పంట దిగుబడి కూడా పెరుగుతుంది. రైతుకు పొలం దున్నటంలో అనవసరపు ఖర్చులు తగ్గిపోతాయి.

ఈ వినూత్న ఆవిష్కరణ రైతులందరికి లాభకరమైన సత్యనారాయణ ట్రాక్టరు హైడ్రాలిక్ లెవెలర్‌ను ఉత్పత్తి చేసి అందుబాటు ధరలో రైతులకు అందించడానికి 'పల్లెసృజన' ఇన్నోవేటర్‌తో కలసి కృషి చేస్తున్నది. ఈ సందర్భంలో వివరాలు కావలసిన వారు ఇన్నోవేటర్‌తో సంప్రదించ గలరు.

పల్లెసృజన సత్యనారాయణ గారి ఇన్నోవేషన్‌ను ఎన్.ఐ.ఎఫ్.–ఇండియాకు తెలుపగా వారు తమ ఇన్నోవేషన్ సెల్ ద్వారా ఈ ఇన్నోవేషన్‌ను జాతీయ స్థాయిలో గుర్తింపుకు ప్రయత్నిస్తున్నారు. ఇన్నోవేటర్‌కు అన్ని రకాల సహాయానికి పల్లెసృజన వాలంటీర్లు పూర్తిగా ప్రయత్నిస్తున్నారు. ●

**సంప్రదించాలనుకున్నవారు :**

**ఇన్నోవేటర్ ముళ్ళపూడి సత్యనారాయణ 90002 50692**

# జగదాంబ N1&N2 మామిడి మొక్కలు

ఈ మామిడి మొక్కలు రైతు ప్రయోగాలతో తయారైనవి. వీటికి జాతీయ గుర్తింపు, సరియైన రిజిస్ట్రేషన్లు వున్నాయి. క్రియేటివ్ మైండ్స్ ద్వారా గత రెండు సంవత్సరాల నుండి మన రెండు తెలుగు రాష్ట్రాలలో ఏడాదిలో మూడుసార్లు కాసే మామిడి చెట్లు మన రైతులకు ఇస్తున్నాము. అవి జగదాంబ **N1&N2** మామిడి రకము. ఇవి నాటిన రెండవ సంవత్సరంలో పూత, మూడవ సంవత్సరం నుండి పండ్లు కాస్తుంది. మేము ఇప్పటివరకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ లోని చాలా జిల్లాల్లో ఈ మొక్కలు ఇచ్చాము. అవి ప్రస్తుతం మన వాతావరణానికి అనుకూలంగా పెరుగుతున్నాయి.

**ఒక ఏడాది వయసు మొక్కలు నవంబర్ డిసెంబర్ నెలల్లో అందుబాటులో ఉంటాయి.**

పూర్తి వివరాలకు **సుభాష్ చందర్ 96528 01700** కి ఫోన్ చేయగలరు.

**2019లో రైతులు నాటిన జగదాంబ మొక్కలు ప్రస్తుతం ఈవిధంగా పెరుగుతున్నాయి.**



**ఈ ఏడాది వయస్సు వున్న మొక్క ఖరీదు రూ. 700/-**

సుమారు 2-3 అడుగుల పొడవు వుంటాయి.

**సుభాష్ చందర్, క్రియేటివ్ మైండ్స్.**

బ్యాంకు అకౌంట్ వివరాలు :

Creative Minds
A/c No: 510101006285094
Ifscode : CORP0000640
Corporation Bank, Sainikpuri Branch

సృజనలు

# ప్రస్తుత సీజన్‌లో రైతులకు అవసరమైన, రైతుల కోరకు రైతులు తయారు చేసిన ఇన్నోవేషన్ల వివరాలు



అంతర సేద్యాలకు, సన్నకారు రైతులు తమ పొలాన్ని మొత్తం దున్నుకోవడానికి అనువైన 5 హార్స్‌పవర్‌ల 'మహిపాల్ కల్టివేటర్'.



మందు వాడని పొలంలోని వేరుశనగ

నిమటోడ్స్ మందు ఉపయోగించిన పొలంలోని వేరుశనగ

## 'నిమటోడ్స్' నివారణకు సేంద్రియ మందు

ప్రస్తుతం వేరుశనగ పైరును ఆశించే 'నిమటోడ్స్' (నులిపురుగులు) వల్ల పంట నష్టం దారుణంగా వుంటుంది. దీని నివారణకు ఇంతవరకు సరియైన పురుగు మందు లేదు. నిమటోడ్స్ నివారణకు వన మూలికలతో రైతులకు శక్తివంతమైన మందు 'పల్లెసృజన' వద్ద సిద్ధంగా ఉంది. నాలుగు సంవత్సరాల పాటు వేరుశనగ పైరుపై ప్రయోగాత్మకంగా నిరూపించబడింది. ఈ మందు వాడిన పంటల్లో 30 నుండి 40 శాతం వరకు దిగుబడి పెరిగింది.



రైతులు తమ పొలాలకు ఎరువులు, కూలీలను తరలించటానికి, పొలం నుండి పంట దిగుమడులు ఇంటికి తరళించటానికి, చిన్న వ్యాపారులు తమ వ్యాపార సరుకులను చేరవేసుకోవటానికి ఎంతో అనువైన బైక్ ట్రాలీ. దీన్ని టి.వి.ఎస్. వాహనం నుండి చిన్న ట్రాక్టరు వరకు దేనికైనా అనుసంధానం చేసుకోవచ్చు.



సుభాని ఇన్నోవేటర్ రైతు అవసరాన్ని బట్టి స్ప్రేయర్లు తయారు చేస్తారు. సోలార్ స్ప్రేయర్లు, తోపుడు బండి స్ప్రేయర్లు, ట్రాక్టర్ బూమ్ స్ప్రేయర్లు, జీవామృతం స్ప్రేయర్లు అందుబాటులో కలవు



వీడర్‌కు అనుసంధానించిన స్ప్రేయర్. తక్కువ శ్రమతో, ఎక్కువ పురుగు మందు సునాయాసంగా తీసుకువెళ్ళి శ్రమ లేకుండా పిచికారి చేసుకోవచ్చు. తక్కువ సమయంలో ఎక్కువ పొలానికి పురుగుమందు చల్లుకోవచ్చు.



పెట్రోలు లేకుండా, చేతితో శ్రమ పడాల్సిన అవసరం లేకుండా, సోలార్ మరియు బ్యాటరీతో పని చేసే పురుగు మందుల స్ప్రేయర్.



# జాతీయ అవార్డు పొందిన గ్రాస్‌రూట్స్ ఇన్నోవేషన్లు

- 'ఎన్.ఐ.ఎఫ్. వారి
రెడీ టు సేల్' ప్రచురణ సౌజన్యంతో...
స్వేచ్ఛానువాదం : జమ్మలమడక శశిమోహన్

## పసుపు కొమ్ముల నూర్పిడి యంత్రం

**సమస్య – పరిష్కారం :**

ఏ పంట అయినా కోతకు వచ్చిన తర్వాత సరియైన సమయంలో నూర్పిడి చేస్తేనే నాణ్యమైన పంట రైతుకు అందుతుంది. కానీ, కూలీలు సమయానికి లభించే స్థితిలో లేనప్పుడు రైతు ఎంతగానో నష్టపోతుంటాడు. ఇటువంటి పరిస్థితుల్లో నూర్పిడి యంత్రాలు రైతాంగాన్ని ఎంతగానో ఆదుకుంటాయి అన్నది నిర్వివాదాంశం. ప్రస్తుతం భారత రైతాంగానికి సరియైన నూర్పిడి యంత్రాల లోటు ఒక పెద్ద





సమస్య. ఈ సమస్యకు పరిష్కారంగా తమిళనాడుకు చెందిన రామరాజు అనే రైతు ఒక పరికరాన్ని రూపొందించాడు.

**పరికరం :**

ఈ పరికరం 'పవర్ టిల్లర్' కు అనుసంధానం చేయటం ద్వారా పని చేస్తుంది. పవర్ టిల్లర్ వెనక భాగంలో దీన్ని అమర్చాల్సి వుంటుంది. ఈ నూర్పిడి యంత్రానికి అమర్చిన బ్లేడ్లు వెనకకు, ముందుకు తిరగటం ద్వారా పసుపు కొమ్ములకు అంటుకున్న మట్టిని తొలగిస్తాయి. కానీ, వాటికి ఎటువంటి నష్టమూ జరగదు.

**సాంకేతిక వివరాలు :**

❀ ఈ పరికరాన్ని 10-12 హార్స్‌పవర్‌ల శక్తిగల పవర్ టిల్లర్‌కు తగిలించాలి.

❀ మూడు కొయ్యలున్న ఈ పరికరం భూమిలోకి సులువుగా చొచ్చుకొని పోతుంది.

❀ పొలం దున్నవలసిన లోతును క్రమబద్ధీకరించే వీలు కూడా కలదు.

❀ 8 స్టీలు పట్టీలు బేడ్ల చివర తగిలించబడ్డాయి.

❀ బ్లేడ్లు భూమిని దున్నేటప్పుడు 10 అంగుళాల వెడల్పు, వెనక పట్టీలు 22 అంగుళాల వెడల్పు దున్నుతాయి. అందువల్ల నూర్పిడి త్రిభుజాకార రూపంలో భూమిని దున్నినట్టుగా కనిపిస్తుంది.

❀ ఈ నూర్పిడి పరికరంతో ఒక ఎకరం పసుపు కొమ్ములను 5 గంటల్లో తీయవచ్చు.

**ముఖ్యాంశాలు :**

❀ పసుపు నూర్పే విధానం ఎంతో ఆకర్షణీయంగా వుంటుంది. రైతుకు ఎటువంటి నష్టము జరగకుండా, అతి తక్కువ పంటనష్టంతో నూర్పిడి చేసుకోవచ్చు.

❀ మనుషులతో పసుపు నూర్పిడి చేసే పద్ధతికన్నా, ఈ యంత్రం ద్వారా నూర్పిడి చేయటం వల్ల 50 శాతం కూలీల ఖర్చు ఆదా అవుతుంది.

**పురస్కారాలు :**

❀ ఎన్ఐఎఫ్ వారి 7వ జాతీయ ద్వైవార్షిక గ్రాస్‌రూట్ ఇన్నోవేషన్స్ 2013 పోటీలలో 'కన్సోలేషన్' బహుమతి అందుకున్నాడు ఇన్నోవేటర్ రామరాజు.

## నాన్‌స్టిక్ (అంటుకోని) మట్టి పెనం

**సమస్య – పరిష్కారం :**

నాన్‌స్టిక్ (అంటుకోని) పెనాలు ముఖ్యంగా దక్షిణ భారతదేశంలో ఎక్కువగా, నూనెలు వాడే వంటకాలలో దేశమంతటా ఉపయోగిస్తుంటారు. పెనానికి అతుక్కోకుండా ఉండటమే దీని ప్రధాన లక్ష్యం. అయితే ఇవి స్టీల్ లేదా ఉక్కుతో, రసాయన పదార్థాలు కోటింగ్ చేసి అమ్ముతుంటారు. వీటి ధర ఎక్కువగా ఉంటుంది. ఒక సంవత్సరంలోపే వీటికి అంటుకోనితనం ముగిసిపోతుంది. ఇంతవరకు మట్టితో అంటుకోని పెనాలను గురించి ఎవ్వరూ ఆలోచించలేదు. ఈ సమస్యకు పరిష్కారంగా మట్టితో నాన్‌స్టిక్ పెనాన్ని తయారు చేశాడు గుజరాత్ రాష్ట్రానికి చెందిన మన్‌సుఖ్‌భాయ్ ప్రజాపతి. ఇతను ఇవే కాదు మట్టితోనే రెఫ్రిజిరేటర్, నీళ్ళ సీసా, వంట పాత్రలు లాంటివి ఎన్నిటినో తయారు చేశారు.

**పరికరం :**



ఆధునిక పరిజ్ఞానాన్ని, సాంప్రదాయ జ్ఞానాన్ని మేళవించి, మట్టితో నల్ల రంగులో నాన్‌స్టిక్ పెనాన్ని తయారు చేశాడు. నల్లరంగు పెనం అయినందువల్ల ఇది వేడిని బాగా ఇమిడించుకుని వంటకు చక్కగా ఉపయోగ పడుతుంది.

**సాంకేతిక వివరాలు :**

❀ మట్టితో తయారు చేయబడింది.

❀ పట్టీలు మాత్రం స్టెయిన్‌లెస్ స్టీల్‌తో తయారు చేసినవి.

❀ 8, 9, 10 అంగుళాల గుండ్రంగా వుండేలా మూడు రకాల్లో లభిస్తాయి.

**ముఖ్యాంశాలు :**

❀ నూనె తక్కువగా అవసరమవుతుంది.

❀ వంట పదార్థాలు పెనానికి అంటుకోవు.





❀ ఆహారం ఆరోగ్యకరంగా ఉంటుంది.

❀ మట్టి పాత్రలపై చేసే వంటల్లో ఓ వినూత్న రుచి ఉంటుంది.

❀ పదార్థాలు అంటుకోకుండా ఒక సంవత్సరం వరకు ఈ పెనం పని చేస్తుంది.

❀ చవక, అందరికీ అందుబాటు ధరలో వుంటుంది.

**పురస్కారాలు :**

❀ ఎన్‌ఐఎఫ్ వారి 5వ జాతీయ ద్వైవార్షిక గ్రాస్‌రూట్ ఇన్నోవేషన్స్ 2009 పోటీలలో బహుమతి గెలుచుకున్నాడు.

**కావాలనుకున్నవారు సంప్రదించండి:**

పల్లెసృజన, ఫోన్ : 040–27111959,
వీరరాఘవ రెడ్డి, 81257 99904 (వీరరాఘవ రెడ్డి)
సెల్ : 96528 01700 (సుభాష్ చందర్)

## 'పల్లెసృజన' పత్రికను ఇతరులూ చదివేలా చేయండి

ఇటీవల ఓ వ్యక్తి ఒక తాను అమలు చేస్తున్న వినూత్న పద్ధతిని మాతో పంచుకున్నాడు. తాను 'పల్లెసృజన' పత్రికను పూర్తిగా చదివిన తర్వాత ఒక 'మంగలి షాపు'లో వుంచుతానని, అక్కడైతే వెంట్రుకలు కత్తిరించుకోవటానికి వచ్చి వేచి చూస్తున్న వారు చదివే అవకాశాలు ఎక్కువ అని తెలియజేశారు. మీరు కూడా మీ పత్రికను మీరు చదివిన తర్వాత ఇతరులూ చదివే అవకాశం కల్పిస్తే, మరింత మంది పల్లెజ్ఞానంతో సంధానించ బడతారు. కొత్త కొత్త ఇన్నోవేషన్లు వారు మనతో పంచుకునే అవకాశముంటుంది.

అలాగే ప్రస్తుత సమాజంలో ఎన్నెన్నో కొత్త కొత్త సాంప్రదాయాలు చోటు చేసుకుంటున్నాయి. చాలామంది పుట్టినరోజు వేడుకలు, పెళ్ళిరోజు వేడుకలు, శుభ కార్యాలు, పదవీ విరమణ వేడుకలు లాంటివాటిలో 'బహుమతులు' ఇవ్వటం ఆనవాయితీగా, ఓ సాంప్రదాయంగా మారింది. ఈ బహుమతి ఓ వస్తు రూపంగానో, డబ్బు రూపంగా కాకుండా 'జ్ఞానాన్ని పంచేది'గా వుంటే ? దాన్ని పుచ్చుకున్న వ్యక్తి ఆ జ్ఞానాన్ని మరో పదిమందికి పంచుతూ మీరిచ్చిన బహుమతిని గురించి ఆనందంగా చెప్పుకుంటాడు కదా! అదీ శాశ్వతా ఆనందాన్నిచ్చే బహుమతి.

ఇలాంటి వేడుకలకు ఇప్పటినుంచి బహుమతిగా 'పల్లెసృజన' చందా మీరు కట్టి వారికి బహుమతిగా ఇవ్వండి పత్రిక వాళ్ళను చేరుకున్నపుడల్లా మీరే జ్ఞాపకానికి వస్తారు. మీ బహుమతి ఒక్కరోజు కాదు, కొన్ని సంవత్సరాల పాటు గుర్తుంటుంది.

– ఎడిటర్

**చందా వివరాల కోసం ఈ పత్రిక వెనక కవర్‌పేజి చూడండి.**

# రైతులకు వరం గడ్డంపాలెం లింగారెడ్డి సృజన

# అడవి జంతువులు, పక్షుల నుంచి పంట రక్షణ



- పల్లె వీరరాఘవ రెడ్డి

రైతు పంటను పండించటం ఒక ఎత్తయితే, దాన్ని కాపాడుకోవటం అంతకన్నా కష్టమైన పనిగా మారుతోంది. ముఖ్యంగా క్రిమి కీటకాలు, తెగుళ్ళు రైతు నడ్డి విరుస్తున్నాయి. వీటి నివారణకే అప్పులపాలై పోతున్న రైతుకు 'గోరుచుట్టుపై రోకటి పోటు'లా కొన్ని ప్రాంతాల్లో అడవి పందులు, జింకలు, కోతులు ఇతర జంతువులు చేతికొచ్చిన పంటను నాశనం చేస్తున్నాయి. వీటిని ఎదుర్కోవటానికి ఎంతో మంది రైతులు ఎన్నో రకాలుగా తమకు తోచిన పద్ధతులను ఉపయోగించి వాటి నుండి పంటను కాపాడే ప్రయత్నాలు చేస్తున్నారు. అయినా సరే అడవి జంతువులు పంటలను నాశనం చేయటానికి తమ శాయశక్తులా ప్రయత్నిస్తునే వున్నాయి. రైతుకు నిద్ర లేకుండా చేస్తునే వున్నాయి.

ఈ సమస్య నుండి గట్టెక్కటానికి తన సృజనాత్మకతతో ఒక మార్గాన్ని కనుగొన్నాడు నిజామాబాద్ జిల్లా, బాల్కొండ మండలంలోని 'రెంజర్ల' గ్రామానికి చెందిన 'గడ్డంపాలెం లింగారెడ్డి' అనే యువ రైతు. గంగారాం, గంగవ్వల సంతానమైన లింగారెడ్డిది ఒక సాధారణ రైతు కుటుంబం. తమ గ్రామం రెంజర్ల అటవీ ప్రాంతానికి సమీపంలో వుండటంతో వీరి పంటలపై అడవి జంతువులు ముఖ్యంగా అడవి పందుల బెడద నిద్ర పట్టనిచ్చేది కాదు. ఎన్నో వ్యయ ప్రయాసలకు ఓర్చి పంటను కాపాడుకుంటే తీరా కోతకు వచ్చే సమయంలో అడవి పందులు ఆ పంటను చేతికొచ్చిన పంటను నోటికి అందకుండా చేస్తుండేవి. ఎన్నో రాత్రుళ్ళు వాటిని పారద్రోలేందుకు కాపలా కాసినా పెద్దగా ఫలితం ఉండేది కాదు.

అడవి పందుల నుండి తన పంటను ఎలా కాపాడుకోవాలా అని ఆలోచించాడు. పొలానికి రాత్రుళ్ళు కరెంటు తీగలతో కంచె ఏర్పాటు చేస్తే ఒకటి రెండురోజులు ఆగి ఆ తర్వాత దానిపైనుండి దుమికి పొలంలోకి ప్రవేశిస్తాయి. విషపు ఎరలు ఏర్పాటు చేసినా సరే ఒకటి రెండు



రోజులకు అవి గుర్తించి, దాన్ని కూడా అవి తినకుండా పంటపైనే పడి నాశనం చేసేవి. ఇక ఇలా చేయటం వల్ల ఆర్థికంగా నష్టం, పైగా కరెంటు తీగలతో కంచె ఏర్పాటు వల్ల ఇతర రైతుల పశువు, కొందరు మనుషులు వాటి ధాటికి గురై మరణించే ప్రమాదం కూడా వుంది. ఈ ప్రకృతిసిద్ధమైన సమస్యను ప్రకృతి తోడుతోనే ఎదుర్కోవాలని ఆలోచించాడు. మనుషి కొన్ని జంతువులకు భయపడతాడు, అలాగే దాదాపు అన్ని జంతువులకు మరికొన్ని జంతువులు అంటే భయం వుంటుంది కదా అని ఆలోచించాడు. అలా అడవి పందులు పులులు, సింహాలు, ఏనుగుల లాంటి జంతువుల అరుపులు వింటే చాలు పారిపోతాయి కదా, వాటి అరువులను కృత్రిమంగా ఏర్పాటు చేస్తే అవి ఇక్కడ ఉన్నాయన్న భయంతో తన పొలం వైపుకు రావు కదా అని ఆలోచించాడు.

అలా కొన్ని క్రూర జంతువుల అరుపుల రికార్డులను సేకరించాడు. వాటిని ఒక 'చిప్'లో నిక్షిప్తం చేసి పొలంలో అక్కడక్కడా స్పీకర్లను ఏర్పాటు చేసి ప్రయోగించి చూశాడు. తాను అనుకున్నట్లుగానే వాటి అరుపులకు అడవి పందులు ఆ పరిసరాల్లోకి కూడా రావటం లేదని గ్రహించాడు. కానీ ఈ అరుపులను పొలంలో ఏర్పాటు చేయటానికి అవసరమైన స్పీకర్లు పని చెయ్యటానికి ఒక బ్యాటరీని ఏర్పాటు చేసి ఆ బ్యాటరీని ప్రతిరోజూ చార్జింగ్ చెయ్యటం ఒక సమస్య అయితే, క్రూర జంతువుల అరుపులు నిరంతరాయంగా ఏర్పాటు చెయ్యటం వల్ల రెండు రకాల సమస్యలు వచ్చిపడ్డాయి. మొదటిది ఎప్పుడూ అలా శబ్దాలు చేస్తూ వుంటే గ్రామానికి దగ్గరలో వున్న పొలాల్లో అయితే ఊర్లో చాలామందికి నిద్రా భంగం కలుగుతుంది. ఇక రెండో సమస్య ఇలా నిరంతరం శబ్దాలు వస్తుంటే ఇవి జంతువులు కావు రైతు ఏర్పాటు చేసినది అని అడవి పందులు గ్రహిస్తే ఇక ఆ పద్ధతి పని చెయ్యదు. రాత్రంతా పొలంలో మేల్కొని వుండి అప్పుడప్పుడూ అలా అరుపులు వినిపించేలా చేస్తూ వుండాలంటే నిద్రలేని రాత్రులను ఎక్కువ రోజులు గడపటం కష్టం. ఇన్ని సమస్యలను పరిష్కరించే దిశగా ఆలోచించాడు లింగారెడ్డి. అందుకు ప్రత్యామ్నాయ మార్గంగా ఈ అరుపులు కావాల్సింది రాత్రిళ్ళు మాత్రమే కాబట్టి పగలంతా బ్యాటరీని ఎప్పటికప్పుడు రీచార్జి అయ్యేలా 'సోలార్' ప్యానల్ ఏర్పాటు చేసుకున్నాడు. పొలం లో అక్కడక్కడా స్పీకర్లను ఏర్పాటు చేసి తాను తయారు చేసిన పరికరం ద్వారా అరుపులు వినపడేలా ఏర్పాటు చేశాడు. ఆ అరుపులు అప్పుడప్పుడూ ఒక నిర్దిష్ట సమయంలో అంటే కొన్ని నిమిషాలకు ఒకసారి వచ్చేలా ఆ పరికరంలో ఒక సమయ నిర్దేశాన్ని ఏర్పరిచే చిప్‌ను అమర్చడం ద్వారా ఐదు లేదా పది నిమిషాలకు ఒకసారి, అది కూడా ఒక్కో సారి ఒక్కో జంతువు అరుపు వినిపించేలా ఏర్పాటు చేశాడు. ఇదంతా ఏర్పాటు



చేసేటప్పటికి దాని ఖర్చు కాస్తా దాదాపు పది వేల వరకు వచ్చింది.

తన ఇన్నోవేషన్‌లో తానే లోపాలను గుర్తించి, వాటిని సరిచేసుకుంటూ ఎన్నో ప్రయోగాలు చేశాడు లింగారెడ్డి. తోటి రైతుల నుంచి తనకు ఎటువంటి సహకారమూ లేదు, ప్రోత్సాహమూ లేదు అయినా తన ప్రయత్నాన్ని విరమించకుండా ఎన్నో ప్రయోగాలు చేసి మొత్తానికి విజయం సాధించాడు. కేవలం పంట నష్టం మాత్రమే కాదు, పొలంలోని డ్రిప్ పైపులను కూడా నాశనం చేసేవి పందులు. పంట నష్టానికి తోడు ఈ పైపుల వల్ల కూడా సంవత్సరానికి 5 నుండి 10 వేల వరకు నష్టం జరిగేది. తన ప్రయోగం పూర్తయిన తర్వాత దీన్ని యూ ట్యూబ్‌లో పెట్టగా ఎంతోమంది రైతుల నుండి ప్రోత్సాహం లభించింది.

ఇలా ఏర్పాటు చేసుకున్న తర్వాత ఇలాంటిది మాకూ ఒకటి చేసి ఇవ్వమని తోటి రైతులు కోరారు కానీ, ఇంత ఖరీదు భరించే స్థోమత కొందరు రైతులకు ఉండదు. అంతా తయారయ్యాక మళ్ళీ ఇదో కొత్త సమస్య వచ్చిపడింది. లింగారెడ్డి ఈ సమస్యకు కూడా పరిష్కారం కనుగొన్నాడు. ఎఫ్.ఎం. రేడియోలా తన పరికరం నుండి శబ్దాలు రేడియో తరంగాల రూపంలో ఒక రిమోట్ ద్వారా తన చుట్టూ వున్న రైతులు తమ పొలంలో అమర్చుకున్న స్పీకర్లకు వెళ్ళేలా ఏర్పాటు చేసి, తన పరికరంతోనే ఆ అరుపులు వారి పొలాల్లోని స్పీకర్లలో కూడా వచ్చేలా చేశాడు. ఇలా చేయటం వల్ల ఖర్చు






రైతుకు అందుబాటులోకి వచ్చింది. అంటే ఒక్కో రైతు పదివేలు ఖర్చు చేసి పరికరం తయారు చేయించుకోవాల్సిన అవసరం లేదు. చుట్టూ వున్న ఐదు మంది రైతులు కలిసి ఒక పరికరం కొనుగోలు చేసి ఆ మొత్తం పొలంలో మధ్యనున్న దాంట్లో పరికరం ఉంచి, చుట్టూ వున్న రైతుల పొలాల్లో కేవలం స్పీకర్లను అక్కడక్కడా ఏర్పాటు చేసుకోవటం ద్వారా ఐదుమంది రైతుల సమస్య తీరిపోతుంది. అంటే ఒక్కో రైతు కేవలం రెండువేల రూపాయలతో అడవి పందుల నుండి తమ పంటలను రక్షించుకోవచ్చు.

కేవలం తన ఊళ్లో వున్న బడి వరకే చదువుకున్న రైతు లింగారెడ్డి ఆలోచన ఆ ఊరి రైతులకు ఒక ప్రధాన సమస్య నుండి ఉపశమనం పొంది, తమ పంటలను రక్షించుకునేలా చేసింది, వారు రాత్రుళ్ళు ఇక తమ పంటకు ఎటువంటి బెడద వుండదు అని ప్రశాంతంగా నిద్రపోయేలా చేసింది. ఎలక్ట్రానిక్ ఇంజనీర్లు చేసే పనిని ఒక సాధారణ రైతు అదీ ఏమీ చదువుకోని రైతు చేయటం నిజంగా అభినందించదగ్గ విషయమే. అందుకే 'పల్లెసృజన' ఇతని సృజనాత్మకతను అభినందిస్తోంది. ఈ పరికరం యావత్ రైతాంగం వినియోగించుకుని పంటలను రక్షించుకోవాల్సిందిగా విజ్ఞప్తి చేస్తోంది. లింగారెడ్డి సృజనా శీలతను 'పల్లెసృజన' జాతీయ, రాష్ట్రీయ స్థాయిల్లో గుర్తింపుకై కృషి చేస్తోంది. ●

మరిన్ని వివరాలకు సంప్రదించండి :

ఇన్నోవేటర్ లింగారెడ్డి ఫోన్ నెం. 98486 60037.




**సంపాదించాలనే ఆశ, తనకు లాభం లేకపోయినా, సామాన్యులకు ఉపశమనం కలిగిస్తూ, వీలైనంత శ్రమను, ఖర్చును తగ్గించుకుంటూ, ఎవరికి వారే తయారు చేసుకునేలా ఇన్నోవేషన్లు అందించిన గొప్ప మనసున్న ఇన్నోవేటర్ "కొల్లి నాగ శ్రీనివాస్". చూసిన తర్వాత ఇంతేనా అనుకోవచ్చు ఎవరైనా, కానీ ఇతరుల బాధలను తగ్గించాలనే తపనతో ఆ ఆలోచనను పదిమందికీ ఉచితంగా పంచి, అందరూ బాగుండాలని కోరుకునే నాగశ్రీనివాస్ ఎంతో అభినందనీయుడు. అతని ఇన్నోవేషన్‌లను గురించి తెలుసుకుందాం.....**

పశ్చిమ గోదావరి జిల్లా, కాళ్ళ మండలం, దొడ్డనపూడి గ్రామానికి చెందిన 'కొల్లి నాగ శ్రీనివాస్' అనే ఇన్నోవేటర్ గురించి 'పల్లెసృజన' పాఠకులకు విదితమే. గతంలో బావిలో నీళ్ళు అయిపోయినపుడు నీళ్ళు తోడే డీజిల్ ఇంజన్ అలాగే నడుస్తూ వుండటం వల్ల అది వేడెక్కి కాలిపోయే ప్రమాదం నుండి కాపాడేందుకు ఒక పరికరం రైతాంగానికి అందించాడు. అలాగే వరిలో కలుపు మొక్కలు, బెరికలను ఏరివేసేందుకు ఎటువంటి అలుపు లేకుండా ఒక చిన్న పరికరం తయారు చేశాడు. తమ సమస్యలకు తామే వస్తువు తయారు చేసుకునేలా సులువైన రూపకల్పన చేయటం కొల్లి నాగ శ్రీనివాస్ ప్రత్యేకత. ఇదే పరంపరలో పొలంలో ఎలుకల పట్టే వారికి తక్కువ ఖర్చుతో వారంతట వారే చేసుకునేలా ఒక ఉపాయాన్ని అందిస్తున్నాడు శ్రీనివాస్.

కొన్ని ప్రాంతాలలో ఎలుకల వల్ల రైతాంగం దాదాపు 25 శాతం పంటను నష్టపోతున్న విషయం అందరికీ తెలిసిందే. ఎలుకలను నిర్మూలించేందుకు ఎంతోమంది రైతులు ఎన్నో రకాల వ్యూహాలను పన్నుతుంటారు. కొందరు విషపు ఎరలను పెట్టి నిర్మూలిస్తే, మరి కొందరు ఎరలను ఏర్పాటు చేసి, బోనులోకి ఎలుకలు చొరబడేలా చేసి ఆ తర్వాత వాటిని చంపేస్తుంటారు. ఇలాంటి పరిస్థితుల్లో పశ్చిమ గోదావరి జిల్లాలోని దొడ్డనపూడి గ్రామంలో ఎలుకలను నిర్మూలించే కొందరు యువకులు మరో కొత్త విధానాన్ని





అమలు చేస్తూ వున్నారు. వారు ఎలుకలను నిర్మూలించేందుకు ఒక చిన్నపాటి ఉపాయాన్ని అందించాడు కొల్లి నాగ శ్రీనివాస్.

సాధారణంగా ఈ ఎలుకలు నిర్మూలించే వారు 'కమ్మరి' పనివారు, మొక్కజొన్న పొత్తులను కాల్చి అమ్ముకునే వ్యాపారులు నిప్పులను రాజేసేందుకు ఒక 'గాలికొట్టే గిరక'ను ఉపయోగిస్తుంటారు. వారి వారి అవసరాన్ని బట్టి ఈ గిరక సామర్థ్యాన్ని పెంచుకుంటూ వుంటారు. ఎలుకలు పొలంలో కన్నాలు చేసుకుని వాటిలో నివసిస్తూ, వాటికి అవసరమైనప్పుడు బైటకు వచ్చి పొలంలోని ధాన్యాన్ని సేకరించి ఆ బొరియల్లోకి తీసుకు వెళ్ళి వాటిని తింటూ తమ జీవనాన్ని గడుపుతుంటాయి. ఒక్కో చోట ఇవి ఒక కన్నం గుండా లోనికి వెళ్ళి మరో కన్నం గుండా బయటకు వస్తూ వుంటాయి కూడా.

ఎలుకలు పట్టే వారు పొలంలో ఎలుకల కన్నాలను గుర్తించి, వాటిలో కొంత వరిగడ్డిని చొప్పించి, అందులో కొంత నిప్పును వేసి గిరక (బ్లోయర్) ద్వారా గాలిని పంపుతారు. అప్పుడు ఆ నిప్పు రాజుకుని వరిగడ్డిని కాల్చుకుంటూ పొగను రాజేస్తుంది. కన్నం బయట నుండి గిరక ద్వారా గాలి పంపుతుంటారు కాబట్టి ఆ పొగ ఎలుకల కన్నంలోకి వెళ్ళి లోపల వున్న ఎలుకలకు ఊపిరి ఆడకుండా అవి చనిపోతాయి. ఇలా కన్నంలోకి పొగను పంపేటపుడు ఆ కన్నం నుండి వెలుపలకు వచ్చే మరో కన్నం గుండా పొగ బయటకు రావటాన్ని గమనించి ఆ కన్నం వద్ద ఒక సంచిని మూసి పెట్టడం ద్వారా ఎలుకలు నేరుగా వాటిలోకి వచ్చి పడుతుంటాయి. ఒకవేళ కన్నం నుండి వెలుపలకు వచ్చే మార్గం లేనట్లయితే ఈ పొగ కన్నాన్ని నింపివేయటం వల్ల ఊపిరి ఆడక ఎలుకలు లోపలే చనిపోతాయి. ఈవిధంగా చేయటం వల్ల పొలంలో ఎలుకలను సమర్థవంతంగా నివారించవచ్చు. కొన్ని చోట్ల ఎలుకలు పూర్తిగా కూడా నియంత్రించ బడుతాయి.

ఎలుకలు పట్టే వారు ఈ గిరకను కొనాలంటే దాదాపు రూ. 700 నుండి 1,200 దాకా ఖర్చవుతుంది. తమ గ్రామంలోని ఎలుకలు పట్టే వారు ఆర్థికంగా పెద్దగా స్థోమత లేనివారు కావటం వల్ల, వాటిని కొన లేక ఒక్కోసారి ఈ గిరకను కిరాయికి తెచ్చుకుని తాము సంపాదించిన దాన్నీ కిరాయికే ఎక్కువ ఖర్చు చేసేవారు. ఈ పరిస్థితిని గమనించిన నాగ శ్రీనివాస్ వీరికో ఉపాయాన్ని ఆలోచించి, అతి తక్కువ ఖర్చుతో ఒక చేసి చూపించాడు. ఎలుకలు పట్టే వారు చేసేది వరి గడ్డిలో నిప్పును రాజేసేందుకు వాడే గిరక చేసే పని గాలిని పంపడం కదా, దానికొరకు అంత ఖరీదు పెట్టి దాన్ని కొనుగోలు చేసేకన్నా, సైకిల్ పంపు ద్వారా కూడా గాలిని చొరబడేలా చెయ్యవచ్చు అని సూచించాడు. ఒక సిల్వర్ పాత్రకు క్రింద ఒక చిన్న రంధ్రం ఏర్పాటు చేసి, ఆ రంధ్రానికి సైకిల్ ట్యూబుకు వున్నటువంటి గాలి చొరబెట్టే చిన్నపాటి గొట్టాన్ని అమర్చాడు. దానికి సైకిల్‌కు గాలి కొట్టే పంపును అనుసంధానం చేసి గాలి కొట్టడం ద్వారా ఎలుకల బొరియల్లోకి గాలి సమర్థవంతంగా చొరబడి వారి పని సులభం చేసింది. ఈ పంపు కొనుగోలు చెయ్యటానికి వారికి ఖర్చయ్యేది కేవలం రూ. 150 మాత్రమే.

తాము ఖరీదు చేయలేని పరికరానికి ప్రత్యామ్నాయం ఏర్పాటు చెయ్యటంతో వారి గ్రామంలో ఎలుకలు పట్టే కార్మికులు ఎంతో సంతోషాన్ని వ్యక్తం చేశారు. ఇది ఎవరంతట వారే తయారు చేసుకునే విధానం కాబట్టి దీన్ని కొనుగోలు చేయాల్సిన అవసరం లేకపోవటం వారికి ఎంతో సంతోషాన్నిచ్చింది. ప్రస్తుతం వారు ఒక్కో సమూహానికి ఒక పంపును కొనుగోలు చేసి తక్కువ ఖర్చుతో ఎలుకలు నిర్మూలించి ఉపాధి పొందుతున్నారు.

నాగ శ్రీనివాస్ దీనితో పాటు మరో ఉపాయాన్ని కూడా రైతులకు అందించాడు. మాగాణి చేసుకునే రైతులు



వరినారు పోసినప్పుడు మడిలో అక్కడక్కడా నిలిచిపోయిన నీటిని బయటకు పంపేందుకు ఎంతో కష్టపడుతూ వుంటారు. మడిలోకి దిగి నడుచుకుంటూ వెళ్ళి అక్కడి నీటిని బయటకు పంపటానికి వీలుకాదు. ఎందుకంటే నారుమడి బురదగా వుండటం వల్ల ఆ రైతు నడిచే చోట వున్న మొలకలు చనిపోతాయి. అందువల్ల ఒక పెద్ద కర్ర లేదా వెదురు బొంగు తీసుకుని పొలం గట్టున నిలబడే ఆ నీటిని తొలగించే ప్రయత్నం చేస్తూ వుంటారు. కర్ర ఎక్కువ వెడల్పు వుండదు, అలా వుంటే దాని బరువును రైతు మోయలేడు. ఈ సమస్యకు నాగ శ్రీనివాస్ ఒక ఉపాయాన్ని సూచించాడు. 2 లీటర్ల నీళ్ళ సీసా మూతిని కత్తిరించి ఆ కర్ర చివరలో లో దాన్ని ఒక తాడుతో గట్టిగా బిగిస్తాడు. ఇప్పుడు రైతు ఆ కర్రతో నీరు నిలుచున్నచోట అదనంగా వున్న నీటిని ఆ సీసాలోకి నింపుకుని బయట పారబోస్తూ వుంటాడు. ఒకవేళ గెట్టుకు దగ్గరగా నీరు ఆగి వున్నట్లయితే ఆ నీటి సీసా అడుగు భాగంతో నేలపై ఒక గీతను గెట్టుకు గీయటం ద్వారా అక్కడ ఆగివున్న నీరు ఆ గీత ద్వారా బయటకు పోతుంది. ఇందుకోసం రైతుకు ఎటువంటి ఖర్చు లేకుండానే తన సమస్యను సులభంగా పరిష్కరించు కుంటాడు.

నాగ శ్రీనివాస్ చేసిన మరో ఇన్నోవేషన్ మోటార్ సైకిల్‌పై గడ్డిమోపు సులభంగా ఎత్తుకునేది. ప్రస్తుతం దాదాపు



ప్రతి రైతు ఇంట్లో ఒక మోటార్ సైకిల్ ఉంటోంది. పశువులకు అవసరమైన మేతను కళ్ళంనుండి ఇంటికి చేర్చి పశువులకు వేస్తూ వుంటారు. కొంతమంది రైతుల ఇళ్ళకు, కళ్ళానికి మధ్య దూరం చాలా వుంటుంది. అటువంటి వారు గడ్డిని తలపై మోయలేక ఎంతో ఇబ్బంది పడుతూ వుంటారు. వారు తాము మోయలేనంత గడ్డిని మోటార్ సైకిల్‌పైన వేసుకుని సులభంగా తీసుకెళ్ళే ఉపాయాన్ని రూపొందించాడు. గడ్డిని ఒక పెద్ద మోపుగా కట్టి దాన్ని మోటార్ సైకిల్ పైకి చేర్చేందుకు మరొకరి సహాయం అవసరం లేకుండా మోటార్ సైకిల్ నుండి నేలమీదకు ఏటవాలుగా వుండేలా కొన్ని కర్రలతో ఒక నిచ్చెన లాంటిది తయారు చేసుకుని, మోటార్ సైకిల్‌కు వెనక వైపున ఆ నిచ్చెనను, మరో కొసను నేలపై వుండేలా ఏటవాలుగా ఏర్పాటు చేస్తాడు. ఇప్పుడు ఆ రైతు పెద్ద మోపుగా వున్న గడ్డిని తోసుకుంటూ ఈ నిచ్చెన ద్వారా మోటార్ సైకిల్ పైకి చేర్చి, దాన్ని ఒక తాడుతో బంధించి ఒక్కడే సులభంగా గడ్డిమోపును ఇంటికి చేర్చుకుంటాడు.

ఎటువంటి ఖర్చు లేకుండా లేదా అతి తక్కువ ఖర్చుతో గ్రామీణుల కష్టాన్ని నివారించే ఇన్నోవేషన్‌లను రూపొందించిన కొల్లి నాగ శ్రీనివాస్ ఎంతో అభినందనీయుడు. "తాను ఇన్నోవేషన్‌లను తయారు చేసి అమ్మటం కంటే, ఎవరికి వారే తయారు చేసుకోగలిగేలా వుండే ఇన్నోవేషన్‌లను రైతులకు అందించి, వారు లాభం పొందుతుంటే చూసిన అనుభూతికి, తృప్తికి ఏదీ సరిపోదు" అంటాడు కొల్లి నాగ శ్రీనివాస్.

ఇదే 'పల్లెసృజన' పథం.... "సపోర్టింగ్ లో కాస్ట్ సొల్యూషన్స్ ఇన్ లైవ్‌లీహుడ్ సెక్టార్" అని. అంటే తక్కువ ఖర్చుతో సమాజానికి శ్రమను తగ్గించే పరికరాలను అందిస్తుంది అన్నమాట. మీదగ్గర కూడా ఇలాంటి ఉపాయాలు ఏవైనా వుంటే వెంటనే మాకు తెలియజేయండి. అందరం కలిసి నలుగురికీ మేలు చేద్దాం. ●

**ఇన్నోవేటర్ కొల్లి నాగశ్రీనివాస్, ఫోన్ 9948 66 2652**



# డా. ఎపిజె అబ్దుల్ కలాం 'ఇగ్నైట్-2019' పోటీ విజేతలు

- 'ఎన్.ఐ.ఎఫ్. వారి వ్యాసాలకు
స్వేచ్ఛానువాదం : జమ్మలమడక శశిమోహన్

## విస్తరాకులు కుట్టే 'స్టాప్లర్'

విద్యార్థి పేరు : **సుయాష్ పటేల్, 10వ తరగతి, శ్రీ చైతన్య టెక్నో స్కూల్, ఖగ్గిదాసపురా, బెంగుళూరు, కర్నాటక.**



పెద్దలు చేస్తున్న పనులు సునిశితంగా గమనించే పిల్లలకి ఎంత చక్కని ఆలోచనలు వస్తాయో నిరూపించే చక్కని నిదర్శనం ఇది.

మన పల్లెటూళ్లలో చాలా మంది, ముఖ్యంగా మహిళలు తమ తీరిక సమయాల్లో లేదా ఉపాధి కోసం కూడా వివిధ రకాల ఆకులతో (బాదం, రావి, అడ్డాకులు) భోజనం, టిఫిన్ చేసే పెద్ద, చిన్న విస్తరాకులు కుట్టడం చేస్తుంటారు. ఈవిధంగా విస్తరాకులు, దొప్పలు, దొన్నెలు చెయ్యటంలో, ఆకులని దగ్గరగా కట్టి ఉంచటానికి వాడే పుల్లలు ఎక్కడ గుచ్చుతున్నామనేది చాలా ముఖ్యం. వీటిలో ఏది చెయ్యాలన్నా పుల్లలు గుచ్చటం మాత్రం తప్పనిసరి. వీటి తయారీలో అనేకమార్లు పుల్లలు గుచ్చి వాటిని విరవాల్సి వస్తుంది. ఇది మాటిమాటికీ చెయ్యాల్సిన ప్రక్రియ. అదే విస్తరాకులని భారీ సంఖ్యలో చెయ్యాలంటే మరీ కష్టం.

ఇది గమనించిన సుమోష్ పటేల్ ఈవిధంగా ఆకులు కుట్టడానికి చేతితో పని చేసే ప్టెప్లర్ లాంటి పరికరం ఉంటే బావుంటుందని, దానిలో చిన్న చిన్న పుడకలు అమర్చి ఉంచితే విస్తరాకుల్ని త్వరగా చెయ్యవచ్చునంటాడితను.

సుమోష్‌కి టివీ చూడటం, ఆటలాడటం, బొమ్మలు గీయటం అంటే ఇష్టం. తాను గీసిన చిత్రాలని ఫేస్‌బుక్‌లో



పెడుతుంటాడు. వీటిని కొన్ని వందల మంది ఫాలో అవుతున్నారు కూడా. పెద్దయ్యాక గుండెకు శస్త్రచికిత్స చేసే సర్జన్ అవ్వాలనుకొంటున్నాడు. అందుకే కుట్టడం పైన శ్రద్ధ చూపిస్తున్నాడా?.... శుభం.

## కాలుతున్న బొగ్గులు ఒలికిపోని కాంగ్రీ

విద్యార్థి పేరు : **ఆసిమ్ సికందర్ మీర్, 8వ తరగతి, ఫెమ్ ఫోర్ట్ ఫ్యూచరిస్టిక్ స్కూల్, వాన్ఫ్, అనంతనాగ్, జమ్మూ కాశ్మీర్.**



ముందుగా కాంగ్రీ అంటే ఏంటో తెలుసుకుందాం. బాగా మంచు పడే హిమాచల్ ప్రదేశ్, జమ్మూ కాశ్మీర్ లోని మనాలీ, లేహ్ లాంటి అతి శీతల ప్రదేశాల్లో శరీరాన్ని వెచ్చగా ఉంచుకోవటం కోసం ఒక కుండ లాంటి దానిలో కాల్చిన బొగ్గులు వేసి దానిని ఒక వెదురు బుట్టలో అమర్చి ఈ మొత్తం బుట్టని ఆ ప్రాంతం వారు తాము సాధారణంగా వేసుకొనే వెచ్చని దుస్తులపై పెహ్రాన్ వేసుకొని (దళసరిగా వున్న పొడవైన కోటు లాంటిది) దాన్ని లోపల అమర్చుకొంటారు. దీనితో ఎంతటి చలి, మంచు ఉన్నా ఇవి ధరించిన వ్యక్తికి వెచ్చగా ఉంటుంది. వచ్చిన ఇబ్బందల్లా ఈ కాంగ్రి మెడకి తగిలించుకొని నడుముకి కట్టుకుని నిటారుగానే ఉండాలి కాని, ఇది ధరించిన వ్యక్తి వంగకూడదు. వంగితే బుట్టలోని కుండలో వున్న కాలుతున్న బొగ్గులు ఒలికి కాలిపోవటం, గాయాలు ఆవటం, అగ్ని ప్రమాదాలు సంభవించటం కూడా జరుగుతుంటుంది.

ఇది గమనించిన ఆసిమ్ సికందర్ మీర్ కొద్ది మార్పులు చేసి కాంగ్రీని రూపొందించాడు. ఒకవేళ అది ధరించిన వ్యక్తి ముందుకి ఏ పనిమీదనైనా ఒంగినా, కాలుతున్న బొగ్గులు చెదదిరి బట్టలపైన పడకుండా లోపల వున్న బొగ్గుల కుండ ఒరిగిపోకుండా పైన బుట్ట ఎటు వరిగినా కూడా కదిలేలా బొగ్గులు చిందిపోకుండా ఉండేలా ఒక చెక్కతో చేసిన జాలి లాంటి దాన్ని ఏర్పాటు చేశాడు. చంటి పాపలు పడుకునే ఉయ్యాలలాగానే ఇది పని చేస్తుంది. పెద్దయ్యాక ఆశిమ్ శాస్త్రవేత్తనవుతానంటున్నాడు..... తథాస్తు!

## చమటని పీల్చుకొనే బూట్లు

విద్యార్థి పేరు : **సాయిదా బాను, 9వ తరగతి, ప్రభుత్వ ఉన్నత పాఠశాల, పాయెన్, కార్గిల్, లడాక్.**



ఎప్పుడూ మంచుతో కప్పబడి ఉండే కార్గిల్ లాంటి ప్రాంతాల్లో మంచులో వాడే బూట్లని కూడా ఇంట్లోనే (వెచ్చని ప్రదేశాలు) ఉంచుకోవాల్సి వస్తుంది. అప్పుడు చెమటతో తడిసిన చర్మం బూట్ల వాసన ఇల్లంతా కమ్ముకునే అవకాశం ఎక్కువ. ఇది గమనించిన సయిదాబాను పాదాలు ఆరోగ్యంగా, ఇళ్ళు, కాళ్ళు వాసన లేకుండా ఉండాలంటే, బూట్లలోపల చమటని పీల్చేసే గుణం కలిగిన బట్టలాంటి దాన్ని తొడుగులా అమర్చాలని అంటుంది. దాంతో బూట్లు ధరించిన వారి పాదాలు ఆరోగ్యంగా ఉండటమే కాక, చెడు వాసనల నుంచి విముక్తి పొందవచ్చునంటుందామె.

అతి చిన్న మారుమూల గ్రామం నుంచి వచ్చిన సాయిదాబాను ఎక్కడికి వెళ్ళినా చిన్న చిన్న వస్తువులని జ్ఞాపికలుగా సేకరించటంతో పాటు బొమ్మలు, రంగులు వేయటం, దుస్తులు తయారు చెయ్యటం అంటే ఇష్టం. పెద్దయ్యాక డాక్టరునై ఆ ప్రాంత ప్రజల ఆరోగ్య సంరక్షణలో పాలు పంచుకొంటాను అంటుంది సాయిదా. చాలా





ఉదాత్తమైన ఆలోచన కదా? మంచిదే.

## కొడవలి పిడిలోనే ప్రథమ చికిత్స సరంజామా

విద్యార్థి పేరు : **కిషన్ ఠాకూర్, 12వ తరగతి, గ్రామకాల గ్రామభారతి, అమ్రపూర్, గాంధీనగర్, గుజరాత్.**



ఇటువంటి ఆలోచన ఇంతకు ముందు ఎవరికీ ఎందుకు రాలేదు. వచ్చినా బైటకి ఎందుకు చెప్పలేదు అనిపిస్తుంది. కిషన్ ఠాకూర్ ఆలోచన వింటే.

కొడవలిని మనం ఏదైనా కొయ్యటానికి లేదా పంటల కోతలలో వాడుతుంటాం. కొయ్యటానికి వాడతాం కనుక వాడుతున్నప్పుడు వాడే వ్యక్తి చెయ్యి లేదా వేళ్ళకి గాయాలవటం సాధారణంగా జరుగుతుంటుంది. సర్వ సాధారణంగా జరిగేదే అయినా సరే సరైన సమయానికి అందుబాటులో గాయానికి చికిత్స చెయ్యటానికి అవసరమయ్యే ప్రథమ చికిత్స సరంజామా అందుబాటులో ఉండదు. ఇదే పొలాల్లో అయితే ఆసాధ్యమనే చెప్పాలి.



కిషన్ ఠాకూర్ ఆలోచన ప్రకారం ప్రథమ చికిత్సకి అవసరమయ్యే ముఖ్య సామాగ్రి అంతా మనం వాడుకునే కొడవలి పిడిలోనే అమర్చుకోగలిగితే ఇటువంటి అత్యవసర సమయాల్లో అందుబాటులో ఉండటమే కాక, ఒకొక్కప్పుడు ప్రమాదం పెద్దది కాకుండా చికిత్స అందించేందుకు వీలవుతుంది.

పెద్దయ్యాక ప్రజా ఉపయోగ కార్యక్రమాలు చెయ్యాలనుకుంటున్నాడు కిషన్. మంచిదే కదా!

# ఎన్.ఆర్.వి. లకు విన్నపము

ప్రతి గ్రామంలో ఎన్.ఆర్.వి. (నాన్ రెసిడెంట్ విలేజర్స్) ఉంటారు. ఉద్యోగ రీత్యా లేదా వ్యాపార రీత్యా తమ గ్రామానికి దూరంగా స్థిరపడిన వారు చాలామంది తమ గ్రామం పట్ల మక్కువ వున్నవారై వుంటారు. అటువంటి వారు తమ గ్రామం కోసం ఏదైనా ఒక మంచి పని చేయాలన్న తపన కలిగిన వారు కూడా వుంటారు.




అటువంటి వారు కేవలం రూ. 1,000/–లతో 5 సంవత్సరాల పాటు గ్రామానికి ఒక మంచి పుస్తకాన్ని అందిస్తే మీకు మంచి పేరు రావటంతో పాటు, మరుగున పడివున్న ఎన్నో ఇన్నోవేషన్లు వెలుగులోకి వస్తాయి, మరెన్నో ఇన్నోవేషన్లను గురించిన సమాచారం మీ గ్రామానికి చేరి, వారు వినియోగించుకునే సదుపాయం కలుగుతుంది.

మీ గ్రామం నుండి వెలుపల జీవనం సాగిస్తున్న మీ మిత్రులకు ఈ విషయం తెలియజేయండి. వారు 'పల్లెసృజన' పత్రికకు చందా పంపి, ఈ పత్రిక మీ గ్రామానికి వచ్చే ఏర్పాటు చేస్తారు.

చందా వివరాలు ఈ పత్రిక చివరి కవర్ పేజీలో ఇవ్వటమైనది. వీలైనన్ని ఎక్కువ గ్రామాలకు పత్రిక వెళ్ళేందుకు సహకరించాల్సిందిగా కోరుతున్నాము.

– ఎడిటర్

# ఆయుర్వేద జ్ఞాన మథనం

# వెల్లుల్లితో వెల్లివిరిసే ఆరోగ్యం



- జమ్మలమడక శశిమోహన్

వెల్లుల్లిని సంస్కృతంలో 'రసోనా' అంటారు. ఇది షడ్రసాలలో ఒకటి. దాదాపు అన్ని రకాల వ్యాధులకు ఇది మంచి మందు కాబట్టే మన ఆయుర్వేద కాలం నుండి ఇది అనేక ఔషధాలలో వాడబడుతోంది. వెల్లుల్లికి పూర్వం 'మాన్పే గుణం' అనే పేరుండేది. ఇందులో యాంటీ బయాటిక్, యాంటీ వైరల్, యాంటీ ఫంగల్ లక్షణాలున్నాయి కాబట్టి ఇది 'ఎయిడ్స్' వ్యాధిగ్రస్తులకు కూడా చాలా బాగా పని చేస్తుంది. మన శరీరంలో వున్న అనవసరపు క్రొవ్వు, ఇతర పదార్ధాలను తీసివేసే గుణం దీని సొంతం. రక్తపోటు (బిపి)ని అదుపులో వుంచుతుంది. చాలావరకు మాత్రలలో వెల్లుల్లిని వాడుతున్నారు. పూర్వంనుండి నేటికీ ఆయుర్వేద వైద్యులు దీన్ని యాంటీ బయాటిక్‌గా ప్రపంచ వ్యాప్తంగా దీనిని ఎన్నో విధాలుగా వాడుతున్నారు. అయితే దీన్ని వాడే విధానం తెలుసుకుని వాడితే మంచిది.

వెల్లుల్లిని దెబ్బలు తగిలినపుడు గాయాలకు పూతగా వాడేవారు. వెల్లుల్లిలో 'ఎ', 'బి', 'సి' విటమిన్లు బాగా వున్నాయని ఇటీవల పరిశోధనల్లో తేలింది. శరీరంలో వున్న మలినాలను తొలగించి మలం ద్వారా బయటకు పంపి, శరీరానికి పోషకత్వాన్ని ఇస్తుంది. వెల్లుల్లిలో 'సల్ఫర్' ఎక్కువగా వుండటం వల్ల గుండె జబ్బులను రానివ్వదు, వచ్చిన వారికి కూడా మంచి మందులాగా పని చేస్తుంది.



వ్యాధి నిరోధక శక్తిని పెంచే గుణం దీని సొంతం. వెల్లుల్లిని పచ్చివి తింటే కడుపులో మంట, గ్యాస్ వచ్చే ఆస్కారం వుంది కాబట్టి ఒకటి రెండు పాయలను నేతిలో వేయించి తింటే మంచిది లేదా అన్నం ఉడికేటపుడు అందులో వేసి, అన్నం ఉడికిన తర్వాత తిన్నా మంచిదే. దీన్ని ప్రతిరోజూ వాడటం వల్ల శరీరంలోని అనవసరమైన, శరీరానికి హాని చేసే వ్యర్థ పదార్థాలన్నీ మల మూత్రాల ద్వారా బయటకు పంపేస్తుంది.

**అరికాలి నొప్పులు, మెడిమ నొప్పులకు వెల్లుల్లి:**

వెల్లుల్లిని రెండు రెబ్బలు తీసుకుని కొద్దిగా వాము, కొద్దిగా కరివేపాకులతో కలిపి మెత్తగా నూరిన పేస్టును పాదాల నొప్పులు, మెడిమ సూల అంటే మెడిమల నొప్పి వున్నవారు నొప్పి వున్నచోట పూసుకుని దానిపైన ఒక ప్లాస్టిక్ పేపరు చుట్టి గుడ్డతో కట్టుకుని రోజూ ఒక గంటసేపు వున్నట్లయితే మూడు రోజుల్లోనే ఆ బాధలన్నీ పోతాయి.

**ఊబ కాయం తగ్గటానికి వెల్లుల్లి:**

కొద్దిగా నిమ్మరసం తీసుకుని, అరకప్పు వేడి నీటిలో వేసి, రెండు వెల్లుల్లి రెబ్బలు మెత్తగా దంచి అందులో కలుపుకుని కొద్దిసేపు వున్న తర్వాత దాన్ని వడకట్టుకొని తాగాలి. అలా రెండు నెలలు తీసుకున్నట్లయితే 7 నుండి 8 కిలోల బరువు తగ్గవచ్చు. మిగతా ఆహార విషయాల్లో పెద్దగా నియమాలు అవసరం లేదు.

**గర్భవతులకు వెల్లుల్లి వైద్యం:**

గర్భవతులుగా వున్నవాళ్ళు రోజూ ఒక వెల్లుల్లి రెబ్బను మెత్తగా దంచి పాలలో వేసుకుని తాగినట్లయితే కడుపులో బిడ్డ ఆరోగ్యంగా పెరుగుతుంది. కొంతమంది శరీరానికి వెల్లుల్లి పడక పోవచ్చు, కాబట్టి ఒకటి రెండు రోజులు కొద్దిగా తీసుకుని, ఎటువంటి సమస్యా లేదు అని తెలుసుకున్న తర్వాత పాటిస్తే మంచిది. ఆస్తమా వ్యాధి వున్నవారు అసలు వెల్లుల్లి తినకపోవటం మంచిది.

**పక్షవాత రోగానికి వెల్లుల్లితో చికిత్స:**

పక్షవాతం వచ్చి, కాలు, చెయ్యి, నోరు వంకర

పోయిన వారికి వెల్లుల్లి అద్భుతంగా పని చేస్తుంది. ఈ వ్యాధి వున్న వారికి వెల్లుల్లి ఆరు నుండి పది రెబ్బలు తీసుకుని, 4–5 చెంచాల వాము కలిపి మెత్తగా నూరి ఆ చూర్ణాన్ని శనగ గింజ లేదా వేరుశనగ గింజంత పరిమాణంలో మాత్రలుగా చేసుకుని వాటిని ఎండబెట్టుకోవాలి. ఆ మాత్రను రోజూ ఒకటి చొప్పున ఆముదంలో ముంచి మింగాలి. అలా చేస్తే వారం రోజుల్లోనే మూతి వంకరలో మార్పు కనబడుతుంది. పదిహేను రోజుల్లో కాలు వంకరలో మార్పు వస్తుంది. నెల రోజుల్లో చేతి వంకర కూడా తగ్గుతుంది. ఇప్పటికి వందలాది మందికి ఈ వైద్యం చెప్పటం జరిగింది. పాటించిన వారందరూ ఎంతో ఉపశమనం పొందారు. పక్షవాతానికి ఇంతకన్నా గొప్ప మందు లేదు. ఈ వైద్యం 'సారయ్య' గారనే గురువు గారి ద్వారా తెలుసుకుని వందలాది మందికి చెప్పగా వాడిన అందరూ బాగున్నామని తెలియజేశారు. ఈ మాత్రలను కేవలం ఒక్క నెల వాడితే చాలు మంచాన పడ్డవారు కూడా లేచి తిరుగాడుతారు.

**శరీరంలోని అనవసరపు పదార్థాలను తొలగించే వెల్లుల్లి:**

మన శరీరంలో మనం తిన్న ఆహారం ద్వారా పెరిగి పేరుకు పోయిన అనవసరమైన, శరీరానికి హాని చేసే పదార్థాలు రోజురోజుకూ లోపల పేరుకుపోయి ఎన్నో రోగాలకు గురి చేస్తాయి. వాటిని ఎప్పటికప్పుడు బైటకు పంపగలిగితే చాలా రోగాల బారిన పడకుండా శరీరాన్ని కాపాడుకోవచ్చు. శరీరంలో ఇలా అనవరపు వ్యర్థాలు తీసివేయటం అనే చర్య రాత్రిపూట పడుకున్నపుడు జరిగేది. ఈ క్రియ జరగటానికి మనం కూడా శరీరానికి కొంత సహకరించాలి కాబట్టి దీన్ని చెయ్యాలి అనుకున్న వారు ఒక్క వారం పాటు మద్యపానం, ధూమపానం, వేపుళ్ళు, గోధుమ పదార్థాలు, మసాలాలు, క్రొవ్వు పదార్థాలు లాంటివి మానేయటంతో పాటు రోజుకొక వెల్లుల్లి రెబ్బను ఉడికించి తీసుకుంటే శరీరంలోని వ్యర్థ మలినాలు అన్నీ బయటకు వెళ్ళిపోతాయి. కనీసం నెలకు ఒక్క వారం ఇలాంటివి మానేస్తే చాలు శరీరం ఎప్పటికప్పుడు మలినాలు శుభ్రమై ఆరోగ్యంగా వుంటారు.

**బరువు తగ్గటానికి వెల్లుల్లి ఔషధం:**

కేవలం ఒక వారం రోజులు ఈ పద్ధతి పాటిస్తే బరువు తగ్గ గలరు. 1వ రోజు కేవలం పండ్లు మాత్రమే ఆహారంగా తీసుకోవాలి. ఏ పండ్లయినా సరే ఉదయం నుండి సాయంత్రం దాకా కేవలం పండ్లు మాత్రమే తీసుకోవాలి. 2వ రోజు కేవలం కూరగాయలు తీసుకోవాలి. అన్నంలో కాదు, కేవలం వట్టి కూరలు మాత్రమే తినాలి. బంగాళా దుంప లేదా చిలకడ దుంప లాంటివి ఏవైనా సరే ఉడక బెట్టుకుని దాంట్లో తగినంత నిమ్మరసం, సైంధవ లవణం, మిరియాల కారం వేసుకుని ఆహారంగా తీసుకోవాలి. అన్నం అనేదే తీసుకోకూడదు. 3వ రోజు క్యారెట్, బీట్‌రూట్, కొత్తిమీర, పుదీన, కరివేపాకు లను ఆవిరిమీద ఉడికించుకుని కొద్దిగా అన్నం, ఎక్కువ కూర వేసుకుని ఆహారంగా తీసుకోవాలి. ఇలా చేస్తే మూడవ రోజుకే శరీరంలోని అనవసరపు పదార్థాలన్నీ శరీరం నుండి బయటకు వెళ్ళిపోవటం ప్రారంభమవుతుంది. 4వరోజు పాలు, అరటిపండ్లు తీసుకోవాలి. పాలల్లో అరటి పండు వేసుకుని తీసుకున్నా సరే లేదా పండు తిన్నాక పాలు తాగినా సరే. ఉదయం నుంచి సాయంత్రం దాకా ఇదే ఆహారం. 5వరోజు తృణ ధాన్యాల ఆహారం. అంటే రాగులు, కొర్రలు, ఊదలు, బరిగెలు, అండుకొర్రలు, సజ్జలు, సోయా, బార్లీ లాంటివి ఏవైనా సరే లేదా అన్నీ కలుపుకుని కలగూరగంపలా జావ వండుకుని తిన్నా సరే. ఆ రోజంతా అదే ఆహారంగా తీసుకోవాలి. 6వ రోజు కూరగాయల జ్యూస్‌ను ఆహారంగా తీసుకోవాలి. మనం తినగలిగిన కూరగాయలను చిన్న చిన్న ముక్కలుగా చేసి, నీటిలో బాగా ఉడకబెట్టాలి. ఆ తర్వాత ఆ కూరగాయలను అందులో మెత్తగా చేసి కలిపి జావలాగా తయారు చేసుకున్నా సరే లేదా కూరగాయలను తీసివేసి, ఆ నీటిలో సైందవ లవణం, మిరియాల పొడి వేసుకుని సూప్ లాగా తీసుకున్నా సరే. ఆ రోజంతా అదే ఆహారం. ఇక చివరి 7వ రోజున దంపుడు బియ్యం లేదా బ్రౌన్ రైస్ ఒక కప్పు రెండు మూడు కప్పుల కూరగాయలు ఏవైనా సరే వేసుకుని వండుకోవాలి. అందులో రుచి కోసం సైంధవ లవణం, మిరియాల కారం లాంటివి కొద్దిగా వేసుకున్నా సరే. ఆ రోజు అవసరమనుకుంటే పండ్ల రసాలను కూడా తీసుకోవచ్చు.

పై వాటితోపాటు ప్రతిరోజూ ఒక ఉడికించిన వెల్లుల్లి రెబ్బను తీసుకోవాలి. ఇలా ఒక్క వారం చేయగలిగితే చాలావరకు బరువు తగ్గి తేలికగా తయారౌతారు.

**గమనిక :** ఈశీర్షికలో ప్రచురించిన వైద్యాలన్నీ ఆయా వ్యక్తుల అభిప్రాయాలు మాత్రమే. వీటిని వాడేముందు విజ్ఞులైన వైద్యులతో సంప్రదించి వాడితే శ్రేయస్కరం.

'వైద్య' ఉమా మహేశ్వర రావు ఫోన్ నెం. : 94402 86854

## స్పందన

**ఎడిటర్ గారికి నమస్కారములు,**

ఈరోజు నేను మన 'పల్లెసృజన' జులై-అగష్టు-2020 సంచిక చదివాను. నన్ను 40 సంవత్సరాల క్రితం జీవితాన్ని గుర్తుకు తెచ్చింది. అప్పుడు నాకు విద్యుత్ ఘాతం వల్ల నా చెయ్యి దెబ్బ తినటంతో ఏ పనీ చెయ్యలేక గ్రామంలో తిరుగుతూ అన్నిటినీ గమనిస్తూ వుండే వాడిని. అలా గమనించిన విషయాల్లో 'సంచార జాతి' పనులను కూడా ఎంతో శ్రద్ధతో గమనించడం జరిగింది. ఈరోజు ఈ కథనం చదువుతుంటే నాకు నాటి రోజులు గుర్తు తెచ్చేలా 'విల్సన్' కథను రూపొందించిన వీరరాఘవ రెడ్డి, శశిమోహన్ గార్లకు కృతజ్ఞతలు. అలాగే నాకు తెలిసినంత వరకు మన తెలుగు వారికి తెలియని 'ఒక గొర్రెల కాపరి మన దేశ సైన్యం శత్రుదేశమైన పాకిస్తాన్‌పై రెండుసార్లు యుద్ధం గెలవటానికి కారణం అయ్యాడు' అన్న నిజమైన కథనం వల్ల ప్రతి రైతుకూలీలు, రైతుల పట్ల ఎంతో మనోధైర్యాన్ని నింపిందని నేను భావిస్తున్నాను. ఇక 'కలుపు నివారణ' మందు విషయానికి వస్తే ఈ మందు ప్రస్తుతం రైతాంగానికి చాలా అవసరం, కానీ ఈ కథనం వల్ల ఎంతో మంది రైతులకు ఎన్నో రకాల పురుగు మందు నివారణ మందుల గురించి తెలియజేసే నాకే అర్థం కాలేదు. కాబట్టి వచ్చే సంచికలోనైనా వివరంగా కథనం వ్రాసి రైతు లోకానికి అందించ గలరని ఆశిస్తున్నాను. ధన్యవాదములు. **– విజయ కుమార్, కడప జిల్లా. ఫోన్ : 9849648498**

**విజయ కుమార్ గారు,**

మీకు పల్లెసృజన కథనాలు నచ్చటం మాకు ఆనందాన్ని కలిగించింది. ఇలాగే మమ్మల్ని ప్రోత్సహించండి. ఈ కథలను మీ తోటివారితో, యువతరంతో పంచుకోండి. వరిలో "కలుపు నివారణ" గురించి మీరన్నట్టుగా రాబోయే సంచికలో పూర్తి వివరాలతో ప్రచురిస్తాం. మీ మనసులోని మాటను మాతో పంచుకున్నందుకు కృతజ్ఞతలు. **– ఎడిటర్.**

**బ్రిగేడియర్ గారూ,**

'పల్లెసృజన' వెలుగులోకి తెచ్చిన ఇన్నోవేషన్‌లు రైతులకు ఎంతో ఉపయోగ పడేవిగా, సామాన్య రైతు కొనగలిగేవిగా వున్నాయి. ఇటువంటి వాటిని ఆంధ్రప్రదేశ్‌లో రెండు మూడు ప్రాంతాల్లో విక్రయించ గలిగేలా ఒక సెంటర్ (షాపు) ఏర్పాటు చేస్తే బావుంటుంది. ఆలోచించి ఏర్పాటు చేయ గలిగితే మావంతు సహకారం కూడా అందిస్తాము. **– కాటసాని రాంభూపాల్ రెడ్డి,** శాసన సభ్యులు, పాణ్యం నియోజకవర్గం. ఆం.ప్ర.

రాంభూపాల్ రెడ్డి గారు,

మీ ప్రోత్సాహానికి ధన్యవాదాలు. మీరు కోరుకున్న ప్రాంతాల్లో ఎవరైనా ఆసక్తి గల యువకులు ముందుకు వస్తే వారికి మా ఇన్నోవేషన్లు, తగిన సమాచారం అందించగలము. ప్రతి జిల్లాలో ఒక ఎఫ్.పి.ఓ.లో ఇన్నోవేషన్లు అమ్మటానికి సౌకర్యం కల్పిస్తే బావుంటుందని మా సలహా. మీ సూచన పాటించేందుకు తప్పక కృషి చేస్తాము. **– బ్రిగేడియర్ పోగుల గణేశం.**


**FORM IV**

***Statement about ownership and other particulars about newspaper (PALLE SRUJANA) to be published in the first issue every year after the last day of February***

| | | | |
|---|---|---|---|
| 1. | Place of publication | : | **102, Vayupuri, Sainikpuri Post,**<br>Malkajgiri Mandal, Medchal-Malkajgiri Dist. –500094. Teelangana |
| 2. | Periodicity of its publication | : | **Bi-Monthly** |
| 3. | Printer's Name | : | **P. Ganesham** |
| | Nationality | : | Indian |
| | Address | : | 102, Vayupuri, Sainikpuri Post,<br>Malkajgiri Mandal, Medchal-Malkajgiri Dist. –500094. Telangana |
| 4. | Publisher's Name | : | **P. Ganesham** |
| | Nationality | : | **Indian** |
| | Address | : | 102, Vayupuri, Sainikpuri Post,<br>Malkajgiri Mandal, Medchal-Malkajgiri Dist. –500094. Telangana |
| 5. | Editor's Name | : | **J. Seshi Mohan** |
| | Nationality | : | **Indian** |
| | Address | : | 2-1-513/2, Nallakunta, Hyderabad - 500 044. |
| 6. | Names and addresses of individuals who own the newspaper and partners or shareholders holding More than one per cent of the total capital. | | |

I, **P. GANESHAM**, hereby declare that the particulars given above are true to the best of my knowledge and belief.

Date28-02-2017

**Signature of Publisher**

పల్లెసృజన
www.pallesrujana.org

# అమ్మకానికి సిద్ధంగా వున్న రైతుల కోసం రైతుల ఇన్నోవేషన్లు

## పోర్టబుల్ పంపుసెట్



వర్షాభావ పరిస్థితుల్లో నీటియెద్దడి నుండి పంటను కాపాడుకునేందుకు పొలాల్లో మొక్కలకు నీరు పోయటానికి, గృహ నిర్మాణాల్లో 'క్యూరింగ్' చేయటానికి, ఇతర అవసరాలకు ఎంతో అనువైనది ఈ పోర్టబుల్ పంపుసెట్. పెట్రోలు సహాయంతో పని చేస్తుంది. 50 అడుగుల లోతునుండి నీటిని లాగి, 500 అడుగుల దూరం సునాయాసంగా నీటిని తోడగలదు. తక్కువ బరువున్న ఈ పోర్టబుల్ పంపుసెట్ ఎక్కడికైనా వెళ్ళేందుకు ఎంతో అనువైనది.

## ఆకు రసాలతో లోహాలు శుభ్రపరిచే ద్రవాలు



పూజ సామాగ్రి, దేవాలయాల్లో ఆభరణాలు, వెండి బంగారు నగలను శుభ్రపరిచేందుకు, గదులు శుభ్రపరిచేందుకు రసాయన క్లీనింగ్ లిక్విడ్ల వల్ల చర్మవ్యాధులు వచ్చే ప్రమాదముంది. పరిసరాల్లో లభించే ఆకుల రసాలతో తయారైన ఈ శుభ్రపరిచే ద్రవాలు. శరీరానికి ఎటువంటి హాని కలుగకుండా, సమర్ధవంతంగా డబ్బును ఆదా చేస్తూ శుభ్రపరుచుకోవచ్చు.

## వికలాంగులు, వృద్ధులకు అనువైన మంచం



పక్షవాత రోగులు లేదా దీర్ఘకాలంగా మంచంపైనుండి లేవలేని స్థితిలో వున్న వారికి ఉపయోగ పడే మంచం మరియు కుర్చీల సహాయంతో ఈ మంచంపై భోజనం, ముఖం కడుక్కోవడం, మల-మూత్ర విసర్జన లాంటి పనులన్ని అక్కడే కదలకుండా చేసుకునే సదుపాయాలు ఈ పరికరాల్లో వుంది.. వాష్ బేసిన్ సదుపాయం కూడా కలదు. ఈ మంచం, కుర్చీలను ఉపయోగించటం వలన సహాయకులకు కూడా చాలా శ్రమ తగ్గుతుంది.

## వాడిన కేబుల్ నుంచి లోహపు తీగను తీసే యంత్రం



వ్యర్థంగా పడివున్న వైర్లలోనుండి లోహపు తీగలను వేరుచేసి విక్రయించుకునే వ్యాపారులకు ఆ తీగలను తీసేందుకు తక్కువ ఖర్చుతో నాణ్యమైన తీగలను వెలికి తీసేందుకు అత్యంత అనువైనది ఈ యంత్రం. కూలీల ఆదాతో పాటు అధిక ఆదాయాన్ని కూడా సమకూరుస్తుంది. వైర్లను కాల్చటం వల్ల ఏర్పడే వాతావరణ కాలుష్యం నుంచి పర్యావరణాన్ని కాపాడుతుంది.

వివరాలకు సంప్రదించండి :
క్రియేటివ్ మైండ్స్, ఫోన్ : 9652801700

# పల్లెసృజన

## పాత సంచికలు కావాలా?

**ఒక్కో సంచిక రూ. 30/-లు మాత్రమే**



పల్లెసృజన చందాదారులు కండి, పల్లె జ్ఞానాన్ని వ్యాపింపజేయండి. చందాదారులుగా చేరాలనుకున్నవారు ఈ క్రింది చిరునామాకు మీ యం.ఓ.లు పంపండి. మీ చిరునామా స్పష్టంగా వ్రాయటం మరవకండి.

**Pay by "Phone Pe" to 9866 00 1678**

పల్లెసృజన, 102, వాయుపురి, సైనిక్‌పురి పోస్ట్,
సికింద్రాబాద్ - 500 094. ఫోన్ : 040-27111959, సెల్ : 8125799904, 9866 00 1678
E-mail : president@pallesrujana.org Visit us : www.pallesrujana.org

**చందా వివరాలు**

| వివరములు | వ్యక్తిగతం |
|---|---|
| రెండు సంవత్సరాలకి | 400/- |
| ఐదు సంవత్సరాలకి | 1,000/- |

లేదా నేరుగా ఈ బ్యాంక్ అకౌంట్‌లో జమ చేయండి.
మీ చిరునామాను స్పష్టంగా మాకు వ్రాసి పంపండి లేదా యస్.యం.యస్. లేదా ఇ-మెయిల్ చేయండి.
M/s Pallesrujana, Syndicate Bank, Sainikpuri, Secunderabad.
SB A/c No. 30232200019150, IFS Code : SYNB0003023

లేదా 'ఫోన్ పే' చెయ్యాలనుకున్న వారు 9866 00 1678 నెంబరుకు పంపి మీ చిరునామా ఎస్ఎంఎస్ లేదా వాట్సయాప్‌లో పంపండి.

QR code for Phone Pe
Scan & Pay Using PhonePe App

narendragrafixhyd@gmail.com 8125799904